Sweken IT Solutions

WE ARE HIRING !!

POWER BI SPECIALIST
DATA ANALYST

INTERESTED CANDITATES
PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

**స్నేహం వల్ల లాభాలు**

స్నేహం చేయడం వలన మనసుకి తనువుకి ఆరోగ్యకరం అంటున్నాయి చాలా అధ్యయనాలు. స్నేహితులు ఉన్నవాళ్ళకు మధుమేహం గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువ. స్నేహ బంధాలు ఉన్నవాళ్లకి కష్టాలు కన్నీళ్లు ఒత్తిళ్లు మనసులోనే పెట్టుకుని కుమిలి పోవాల్సిన పనిలేదు. అన్ని పంచుకున్నప్పుడు మెదడులో ఆక్సిటోసిన్ స్థాయి పెరిగి మనసు తేలిక పడుతుంది. 2010లో అమెరికాలో చేసిన అధ్యయనంలో స్నేహితులు ఎక్కువ ఉన్న వారికి మరణం త్వరగా రాదని తేలింది. మీరు మంచి స్నేహితులని వదులుకోవద్దు.

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 141 విశాఖపట్నం, 14 మార్చి 2025 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## రంగుల పండగ హెూలీ నేడు

వసంత కాలంలో వచ్చే ఈ పండగను భారతదేశంలోనే కాకుండా, నేపాల్, బంగ్లాదేశ్‌లోనే కాకుండా ప్రవాస భారతీయులు కూడా వేడుకగా జరుపుకుంటారు.ఉత్తరాది రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకునే ఈ పండగ దక్షిణాది రాష్ట్రాల్లోనూ ప్రాచుర్యం పొందింది. ఉదయం నుంచి యువతీయువకులు రోడ్లపైకి చేరుకుని ఒకరిపై ఒకరు రంగులు, రంగు నీళ్లు చల్లుకుంటూ కేరింతలు కొడతారు. సాధారణంగా హెూలీ ఏటా ఫ్రిబవరి నెలాఖరునగాని మార్చి నెలలోగాని వస్తుంది. ఈ ఏడాది మార్చి 14న ఈ పండగను వేడుకగా జరుపుకునేందుకు యువత సమాయత్తమవుతోంది.



## టీడీపీ హయాంలోనే విద్యుత్ రంగంలో

# తొలి సంస్కరణలు : సీఎం



అమరావతి(విశాఖ సమాచారమ్): విద్యుత్ రంగంలో తొలి సంస్కరణలు తీసుకొచ్చింది టీడీపీ ప్రభుత్వమేనని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. శాసనసభలో ఇంధన శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు.'1988లో విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. డిస్ట్రిబ్యూషన్, జనరేషన్, ట్రాన్స్‌మిషన్‌గా విభజించాం. ఎనర్జీ ఆడిటింగ్ తీసుకొచ్చాం. కరెంట్ కొరత లేని ఏకైక రాష్ట్రంగా ఏపీని తయారు చేశాం. ఆనాడు తీసుకొచ్చిన సంస్కరణల ఫలితాలను చూసి సంతోషించాం. వ్యవసాయానికి యూనిట్‌కు వసూలు చేసే పరిస్థితి నుంచి శ్లాబ్ రేటుతో రైతులను ఆదుకుంది టీడీపీ ప్రభుత్వమే. 2014లో రాష్ట్రంలో 22.5 మిలియన్ యూనిట్ల కరెంట్ కొరత ఉండేది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో దాన్ని సవాల్‌గా తీసుకున్నాను. 2014 డిసెంబర్‌కు ఎక్కడా కరెంట్ కొరత లేకుండా చేసి.. జనవరి 2018 నాటికి మిగులు విద్యుత్ సాధించిన రాష్ట్రంగా మార్చాను. ఇప్పుడు గర్వంగా చెబుతున్నా..9 గంటలు వ్యవసాయానికి కరెంట్ ఇస్తున్నాం. నేను 1995లో మొదటిసారి సీఎం అయ్యేసరికి 10 నుంచి 15 గంటల పాటు కరెంట్ కోతలుండేవి. పరిపాలన ఎలా ఉండాలో ఆలోచించా.. అందుకు అనుగుణంగా ప్రణాళికలతో ముందుకెళ్లా. మీటర్ రీడింగ్ కోసం స్పాట్ బిల్లింగ్ తీసుకొచ్చాం. ప్రపంచం మొత్తం అధ్యయనం చేశా..ప్రపంచ బ్యాంకు జీతగాడు అని నాపై విమర్శలు చేశారు" అని చంద్రబాబు అన్నారు.

**అంతర్జాతీయ అంశంగా పీపీఏల రద్దు**

విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఉన్న ఏపీని..వైసీపీ ప్రభుత్వం లోటు పరిస్థితికి తీసుకెళ్లిందని చంద్రబాబు మండిపడ్డారు. పరిశ్రమలు కరెంట్ వాడితే సర్‌ఛార్జీ విధించిన (మిగతా 2లో)

## యువతలో ఏఐ నైపుణ్యాలకు

# మైక్రోసాఫ్ట్‌తో కీలక ఒప్పందం

## ఏటా 2 లక్షల మందికి శిక్షణ

అమరావతి(విశాఖ సమాచారమ్) : రాష్ట్రంలోని యువతకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాభివృద్ధి కోసం అంతర్జాతీయ స్థాయి సంస్థ అయిన మైక్రోసాఫ్ట్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన ఒప్పందం చేసుకుంది. ఏఐ, డిజిటల్ ప్రొడక్టివిటీలో ఏటా 2 లక్షల మందికి శిక్షణ ఇచ్చేలా మైక్రోసాఫ్ట్‌తో తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి సచివాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ఎంవోయూపై సంతకాలు చేశారు.వృత్తి విద్య, మాధ్యమిక పాఠశాల పిల్లలు, యువతలో ఏఐ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించి రాష్ట్రంలో ఐటీ ఆధారిత, ఇతర పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యవంతమైన సిబ్బందిని తయారు చేయడం ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది వ్యవధిలో 2లక్షల మంది యువతకు మైక్రోసాఫ్ట్ సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయంగా ఏఐ, అధునాతన టెక్నాలజీల్లో వస్తున్న అవకాశాలను (మిగతా 2లో)



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉక్కు కార్మికుల మృతి

గాజువాక (విశాఖ సమాచారమ్) : దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో విశాఖ స్టీల్ సిటీ (కూర్మన్నపాలెం) వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతి చెందిన వ్యక్తులు స్టీల్ ప్లాంట్ ఒప్పంద కార్మికులుగా పోలీసులు గుర్తించారు. నక్కపల్లి కృష్ణ, దొండపర్తి రాంబాబు అనకాపల్లి నుంచి కూర్మన్నపాలెం వైపు వెళ్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఒక వ్యక్తికి తలకు బలమైన గాయం కావడంతో కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రశ్నపత్రాల లీక్‌లతో

# అంధకారంలో విద్యార్థుల భవిత

**-కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ**



ఢిల్లీ : ప్రశ్నాపత్రాల లీక్‌లపై కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి స్పందించారు.ఈ లీక్‌ల కారణంగా కష్టపడి చదివే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీనిపై పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ప్రశ్నాపత్రాల లీకులతో 6 రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి కారణంగా కష్టపడి చదివే పిల్లలతో పాటు వారి కుటుంబాలు ఒత్తిడికి గురవుతున్నాయి. వారి కష్టానికి తగిన ఫలితం అందడం లేదు. దీని వల్ల కష్టపడి పనిచేయడం కంటే నిజాయితీగా లేకపోవడమే మంచిదనే తప్పుడు సందేశం భవిష్యత్తు తరాలకు వెళుతుంది.అది ఆమోదయోగ్యం కాదు. నీట్ పేపర్ లీక్ దేశాన్ని కుదిపేసి ఏడాది కూడా కాలేదు. దీనిపై మేము పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తంచేశాం.ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం లీకులను అడ్డుకోలేకపోయింది.ఇది వారి వైఫల్యానికి నిదర్శనం. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు పక్కనబెట్టి దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వీటిని అరికట్టగలం. ఈ పరీక్షలు మన పిల్లల హక్కు. దాన్ని ఎలాగైనా రక్షించాలి' అని రాహుల్ రాసుకొచ్చారు. పేపర్‌లీక్‌లపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ పోస్టు చేశారు.

## మహాకుంభమేళాతో

# రైల్వేకు భారీ ఆదాయం

## టికెట్ల విక్రయాల ద్వారా రూ.200 కోట్ల ఆర్జన




ప్రయాగ్‌రాజ్: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ జరిగిన మహాకుంభమేళాకు కోట్లాది మంది జనం తరలి వచ్చారు. ఫలితంగా యూపీ సర్కారుకు లెక్కలేనంత ఆదాయం సమకూరింది. కుంభమే ళాకు వచ్చేందుకు జనం ప్రధానంగా రైళ్లను ఆశ్రయించారు.ఈ నేపథ్యంలో రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను కూడా నడిపింది.నెలన్నర పాటు జరిగిన మహా కుంభమేళాలో ప్రయాగ్‌రాజ్‌లోని ఎనిమిది రైల్వే స్టేషన్ల నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లిన రైళ్ల ద్వారా రైల్వేశాఖకు టిక్కెట్ల విక్రయాల రూపంలో దాదాపు రూ.200 కోట్లు సమకూరాయి.నార్త్ సెంట్రల్ రైల్వే జోన్‌లోని ప్రయాగ్‌రాజ్ డివిజన్‌కు చెందిన డీఆర్ఎం హిమాన్షు (మిగతా 2లో)

## గుంజీలు తీసిన హెడ్ మాస్టర్!



బొబ్బిలి(విశాఖ సమాచారమ్) : సాధారణంగా పాఠశాలల్లో పిల్లల అల్లరిని నియంత్రించడానికి, బాగా చదవని పిల్లలను దారిలోకి తీసుకొచ్చేందుకు మాస్టార్లు దండించడం మనకు తెలిసిందే..కాని ఆ పాఠశాలలో సీన్ రివర్స్ అయింది.విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టేందుకు ఓ స్కూల్ హెడ్ మాస్టర్ వినూత్న ఆలోచన చేశారు. విద్యార్థులు చేసిన తప్పులను తనవిగా భావించి తనకు తానుగా శిక్ష వేసుకున్నారు.ఎంత చెప్పినా విద్యార్థుల అల్లరి తగ్గకపోవడంతో వారిని దండించకుండా పిల్లలకు అర్థమయ్యేలా చెప్పారు. విద్యార్థుల ప్రార్థన సమయంలో వారికి సాష్టాంగ నమస్కారం చేసి, గుంజీలు తీశారు. ఈ ఘటన విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పెంట జిల్లాపరిషత్ పాఠశాల ప్రాంగణంలో చోటుచేసుకుంది. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, ప్రవర్తనపై దృష్టి సారించాలని, లేకపోతే తమ ప్రయత్నమంతా వృథా అవుతుందని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను పట్టించుకోవడం లేదని, శ్రద్ధగా చదివించాలని రమణ కోరారు. తమ ప్రయత్నానికి తోడు (మిగతా 2లో)

# చంద్రయాన్-4కు మార్గం సుగమం!

## విజయవంతంగా స్పాడెక్స్ శాటిలైట్స్‌ని అన్‌డాక్ చేసిన ఇస్రో

**హెూలీ పండుగకు ముందు ఇస్రో దేశ ప్రజలకు శుభవార్త చెప్పింది. స్పాడెక్స్ ఉపగ్రహాన్ని విజయవంతంగా అన్‌డాక్ చేసినట్లు ప్రకటించింది.దాంతో చంద్రయాన్-4 మార్గం సుగమం అయింది. అంతరిక్షలో ఉపగ్రహాలను కలిపే ప్రక్రియను డాకింగ్‌గా పిలుస్తారు. వాటిని మళ్లీ వేరే చేసే ప్రక్రియనే అన్‌డాకింగ్ అంటారు.**



బెంగళూరు : అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానం చేసే మిషన్‌ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన విషయం తెలిసిందే. భవిష్యత్‌లో చేపట్టబోయే భారీ అంతరిక్ష యాత్రలకు అవసరమైన ఈ కీలక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టిన ఇస్రో ఆ దిశగా మరో అడుగు వేసింది.తాజాగా స్పేడెక్స్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించింది. దీనిపై అంతరిక్ష సంస్థకు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ శుభాకాంక్షలు తెలియజేశారు.'ఈ విజయం ప్రతి భారతీయుడిలో ఉత్సాహాన్ని నింపుతుంది.నమ్మశక్యం కాని డీ డాకింగ్ ప్రక్రియను స్పేడెక్స్ శాటిలైట్లు పూర్తి చేశాయి. భారతీయ అంతరిక్ష స్టేషన్, చంద్రయాన్-4, గగన్‌యాన్ సహా భవిష్యత్ ప్రయోగాలకు మార్గాన్ని సుగమం చేసింది' అని మంత్రి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానించే మిషన్‌లో భాగంగా ఇస్రో.. గతేడాది డిసెంబర్ 30న ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపించింది. పలు ప్రయత్నాల అనంతరం చివరకు జనవరి 16న డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా చేపట్టింది. దీంతో ఈ ఘనత సాధించిన నాలుగో (మిగతా 2లో)

## ఏయూలో అక్రమాలపై

# విజిలెన్స్ విచారణ

## శాసనసభలో మంత్రి మంత్రి నారా లోకేశ్



అమరావతి(విశాఖ సమాచారమ్) : ఆంధ్ర యూనివర్సిటీలో మాజీ వీసీ ప్రసాదరెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై 60రోజుల్లో విజిలెన్స్ విచారణ పూర్తిచేసి, కఠినమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు.ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి అవినీతి, అక్రమాలపై శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణ, గణబాబు, విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణ (మిగతా 2లో)

# టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## అధికారులకు ఏపీ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం



అమరావతి(విశాఖ సమాచారమ్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పదో తరగతి విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవ్వరి వద్ద మొబైల్ ఫోన్ ఉండేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా ఫోన్లు తీసుకువస్తే వాటిని గేటువద్దే సేకరించి భద్రపరచాలని సూచించారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై మార్చి 12న ఆయన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే పరీక్షల నిర్వహణ సమయంలో పేపర్ లీక్‌లకు సంబంధించి తప్పుడు వార్తలు సోషల్ మీడియాలో ఎవరైనా వ్యాప్తి చేస్తే.. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలు చేయాలని విజయానంద్ ఆదేశించారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించనున్న పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6,19,275 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 3,15,697 మంది, బాలికలు 3,03,578 మంది వరకు ఉన్నారు.మొత్తం 3,450 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సమస్యాత్మక కేంద్రాలు 163 వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయనున్నారు. పరీక్షలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్ 0866 2974540కు ఫోన్ చేయాలని సూచించారు. కాగా ఇప్పటికే పదో తరగతి పరీక్షల హాల్ టికెట్లను విద్యాశాఖ జారీ చేసిన సంగతి తెలిసిందే. వాట్సప్ ద్వారా కూడా వీటిని పొందే సదుపాయం ప్రభుత్వం కల్పించింది.

## ముంబయిలో 11 అంతస్థుల రైల్వే స్టేషన్




**ముంబయి :** భారతీయుల కలల నగరం ముంబయి త్వరలో మరో ఖ్యాతిని దక్కించుకోబోతోంది. ముంబయిలోని థానేలో 11 అంతస్థుల రైల్వే స్టేషన్ నిర్మితం కానుంది. ఈ రైల్వే స్టేషన్‌లో కేవలం రైళ్ల రాకపోకలే కాకుండా ప్రయాణికులకు వినోదాన్ని అందించే పలు వేదికలు కూడా సిద్ధం కానున్నాయి. ఈ రైల్వే స్టేషన్ పైభాగంలో అద్భుతమైన మాల్, ఆఫీస్ స్పేస్, రిటైల్ షాపులు కూడా ఉండనున్నాయి. ఈ ప్రాజక్టు పూర్తయితే రైల్వేశాఖకు భారీగా ఆదాయం సమకూరనుంది. థానే రైల్వే స్టేషన్‌లోని 10ఏ ప్లాట్‌ఫారంలో తొమ్మిది వేల చదరపు మీటర్ల ప్రాంతాన్ని ఈ ప్రాజెక్టుకు కేటాయించనున్నారు. దీనితోపాటు 24,280 చదరపు మీటర్ల ప్రాంతాన్ని లీజుకు తీసుకోనున్నారు. ఈ లీజు 60 ఏళ్ల పాటు కొనసాగనుంది. ఈ ప్రాజెక్టును 2026, జూన్ 30 నాటికి పూర్తిచేయాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రైల్వే స్టేషన్‌కు బస్సులు, మెట్రో సేవలను అనుసంధానించనున్నారు. రైల్వే స్టేషన్ బేస్‌మెంట్‌లో పార్కింగ్ సౌకర్యం కూడా కల్పించనున్నారు. ఇక్కడి నుంచే లోకల్ బస్సులు ఎక్కే అవకాశం కల్పించనున్నారు. పైఫ్లోర్‌లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. ఇక్కడ ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్‌లు ఏర్పాటు చేయనున్నారు. కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటుకు కూడా అనుమతి ఇవ్వనున్నారు.

# వేసవిలో తుపానులు

**ఓ వైపు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మాత్రం భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతారణ శాఖ తెలిపింది.**



**ఢిల్లీ :** దేశంలో వేసవి కాలం మొదలైనా కూడా పలు ప్రాంతాల్లో మాత్రం వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో మార్చి 15 వరకు జమ్మూ కశ్మీర్, బిహార్, పశ్చిమ బెంగాల్ సహా అనేక రాష్ట్రాల్లో వానలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఈ వర్షాలు, రెండు వేర్వేరు తుఫానుల ప్రభావంతో వస్తున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ నుంచి బిహార్ వరకు, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు వంటి ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు ఉంటాయని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఈ వర్షాల కారణంగా రెండు ప్రధాన తుపానులు కూడా వచ్చే ఛాన్స్ ఉందని ప్రకటించింది. వీటి ప్రభావం దేశంలోని ఉత్తర, తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో కూడా ఉంటుందని సూచనలు జారీ చేసింది.

**తుపానుల ప్రభావం**

అయితే ఈ తుపాను మొదట ఇరాక్ ప్రాంతంలో ఉద్భవించి,ఉత్తర భారతదేశంలోని జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్,పంజాబ్ ప్రాంతాలను ప్రభావితం చేస్తాయని ఐఎండీ తెలిపింది. ఈ తుపాను వర్షపాతం, ఉరుములతో కూడిన భారీ వర్షాలతో వస్తుందని, దీంతో ఢిల్లీ ప్రాంతవాసులు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ వెల్లడించింది.

**మరో తుపాను**

రెండో తుపాను బంగ్లాదేశ్ సమీప ప్రాంతంలో ఉద్భవించి, భారతదేశం వైపు కదులుతుందని వెదర్ రిపోర్ట్ చెప్పింది. ఇది ప్రధానంగా తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు వర్షపాతాన్ని తెస్తుందన్నారు. ఈ తుఫాను కూడా ఐదు రోజుల పాటు (మార్చి 13 నుంచి 15 వరకు) భారీ వర్షాలకు కారణమవుతుందని వెల్లడించింది. ఈ క్రమంలో ఉరుములతో కూడిన వర్షాలను ఆశించవచ్చని తెలిపింది.

## కొత్తగా ఎన్నికైన ఐదుగురు ఎమ్మెల్సీలు



**అమరావతి(విశాఖ సమాచారమ్) :** ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు మొత్తం ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యా యి. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రంతో ముగిసింది. దీంతో బరిలో ఉన్న కొణిదల నాగేంద్రరావు (జనసేన), బీద రవిచంద్ర(టీడీపీ), బి.తిరుమల నాయుడు (టీడీపీ), కావలి గ్రీష్మ ప్రసాద్ (టీడీపీ), సోము వీర్రాజు (బీజేపీ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిట ర్నింగ్ అధికారి ఆర్.వనితా రాణి ప్రకటించారు. ఎన్నికైన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

## ఏపీ ఇంటర్మీడియట్ విద్యలో కీలక సంస్కరణలు: మంత్రి లోకేశ్

**అమరావతి(విశాఖ సమాచారమ్) :** ఇంటర్మీడియట్ విద్యలో కీలక సంస్కరణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. మంత్రి లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇంటర్ మ్యాథ్స్ ఎ-బి ఒకే సబ్జెక్ట్‌గా, బోటనీ, జువాలజీ ఒకే సబ్జెక్ట్‌గా పరిగణించాలని నిర్ణయించారు. ఇకపై ఏటా ఫిబ్రవరి చివరి వారం నుంచే ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. జూనియర్ కాలేజీల్లో ఎం బైపీసీ కోర్సుకు అనుమతిచ్చారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులను తయారు చేసేందుకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి క్యాలెండర్‌లో మార్పులు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి.. జూన్ 1వ తేదీకి బదులుగా ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభమవుతాయని లోకేశ్ తెలిపారు. జూన్ 1కి బదులుగా ఏప్రిల్ 7 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశాలు జరగనున్నాయని చెప్పారు.

## యూట్యూబ్ చూసి స్మగ్లింగ్ నేర్చుకున్నా: రన్యారావు



**బెంగళూరు :** దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన కన్నడ నటి రన్యారావు కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే రావు బెయిల్ అర్జీపై తీర్పును బెంగళూరులోని ఆర్థిక నేరాల విభాగం ప్రత్యేక కోర్టు 14వ తేదీకి రిజర్వు చేసింది. ఇక రన్యా బంగారం దందాలో కొత్త కొత్త సంగతులు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఈ కేసులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఆమెను కస్టడీకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. విచారణ సందర్భంగా ఆమె పలు విషయాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. విచారణలో రన్యా రావు.. 'దుబాయ్ నుంచి ఇంతకుముందు ఎప్పుడూ బంగారాన్ని అక్రమంగా తీసుకురాలేదు. స్మగ్లింగ్ చేయడం ఇదే మొదటిసారి. ఎవరికీ కనబడకుండా బంగారాన్ని ఎలా దాచాలన్నది యూట్యూబ్‌లో చూసి నేర్చుకున్నా' అంటూ అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. రన్యా రావు బంగారు స్మగ్లింగ్ కేసులో రాష్ట్ర పోలీసులు అధికారాలను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై సీఐడీ దర్యాప్తునకు అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వును కర్ణాటక ప్రభుత్వం బుధవారం ఉపసంహరించుకుంది. అయితే, కర్ణాటక ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తా నేతృత్వంలో రన్యా రావు తండ్రి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) కె రామచంద్రరావు పాత్రపై దర్యాప్తు కొనసాగుతుందని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

## గుండెపోటుకు చైనా వ్యాక్సిన్!



**బీజింగ్ :** గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించడానికి చైనా వ్యాక్సిన్‌ను రూపొందించింది. రక్తనాళాలు గట్టిపడడం,రక్తవాహికల్లో రక్త ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడడానికి కారణమయ్యే 'ప్లేక్స్' ఏర్పడడాన్ని ఈ నానో వ్యాక్సిన్ నిరోధిస్తుంది. నాన్జింగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, చైనా యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా 'కాక్‌టెయిల్' రూపంలో ఈ నానో వ్యాక్సిన్‌ను రూపొందించాయి. రక్తనాళాలు పెళుసుబారకుండా, వాహికల్లో కొవ్వు పొరలు (ప్లేక్స్) ఏర్పడకుండా అనేక ప్రొటీన్లు పనిచేస్తున్నా యన్న పూర్వ పరిశోధనా ఫలితాలు తాజా రూపకల్పనకు స్ఫూర్తి. అలా పనిచేసే వాటిలో పీ210 కారకం ఒకటి. దీనిని ఐరన్ ఆక్సైడ్ నానోపార్టికల్స్‌కు జత చేశారు. ఇలా తయారుచేసిన వ్యాక్సిన్ రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఒక ఉత్ప్రేరకాన్ని వాడారు. దీనిని తొలిదశలో ఎలుకలపై ప్రయోగించినప్పుడు చక్కటి ఫలితాలు వచ్చాయి.

## ఉచితాలతో పేదరికం పోదు..
## ఇన్ఫోసిస్ నారాయణమూర్తి



**ముంబయి :** ఉచితాల ద్వారా పేదరికం పోదని, అలా ప్రయత్నించిన దేశాలు విఫలమయ్యాయని ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి అన్నారు. దేశంలో ఉచితాల ద్వారా కాదు.. వినూత్న వ్యవస్థాపకులు సృష్టించే ఉద్యోగాలు పేదరికం తొలగింపునకు సహాయపడతాయనిఆయన తెలిపారు. టైకన్ ముంబై 2025 కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉచితాలు ఇచ్చిన ఏ దేశం కూడా విజయం సాధించ లేదు అని పేర్కొన్నారు.

## మద్యంపై 150 శాతం సుంకాలా?
## భారత్‌పై అమెరికా విమర్శలు

**న్యూయార్క్ :** డోనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధం నేపథ్యంలో.. ఇండియాపై శ్వేత సౌధం కీలక ఆరోపణ చేసింది. అమెరికా మద్యం, వ్యవసాయ ఉత్పత్తులపై .. భారత్ అధిక స్థాయిలో సుంకాలు వసూల్ చేస్తున్నట్లు చెప్పింది. అమెరికన్ మద్యంపై భారత్ 150 శాతం దిగుమతి సుంకాన్ని వసూలు చేస్తున్నట్లు వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి కరోలిన్ లివిట్ తెలిపారు. అమెరికా వస్తువులపై వివిధ దేశాలు విధిస్తున్న సుంకాలకు సంబంధించిన గణాంక వివరాలను ఆమె వైట్‌హౌస్‌లో మీడియాకు వెల్లడించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అమెరికా మద్యంపై ఇండియా భారీగా సుంకాన్ని వసూల్ చేస్తుందన్నారు. కెనడాతో జరుగుతున్న ట్రేడ్ వార్ గురించి ప్రశ్న వేయగా ఆమె ఇండియాపై కూడా రియాక్ట్ అయ్యారు. అమెరికాను, దేశానికి చెందిన హార్డ్ వర్కింగ్ అమెరికన్లను కూడా కెనడా మోసం చేస్తోందన్నారు. అమెరికా ప్రజలు, వర్కర్లపై కెనడా సర్కారు అత్యధిక స్థాయిలో టారిఫ్‌లు వసూల్ చేస్తున్నట్లు ప్రెస్ సెక్రటరీ ఆరోపించారు. కెనడా, భారత్, జపాన్ లాంటి దేశాలు వసూలు చేస్తున్న సుంకాలకు చెందిన ఛార్ట్‌ను ఆమె ప్రజెంట్ చేశారు. అమెరికాకు చెందిన చీజ్, బటర్‌పై 300 శాతం సుంకాన్ని కెనడా వసూల్ చేస్తున్నట్లు ఆరోపించారు.

## రాజధాని రైతులు,మహిళల కన్నీరులో
## వైసీపీ కొట్టుకుపోయింది
## టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు



**అమరావతి(విశాఖ సమాచారమ్) :** గత ప్రభుత్వ హయాంలో చేసిన మూడు రాజధానుల ప్రకటనతో అమరావతి ప్రాంత రైతుల వెంట ఉండాలని నిర్ణయించుకు న్నానని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. రైతు బిడ్డగా అండగా నిలిచానని.. కేసులు పెట్టినా వెనుకడుగు వేయలేదన్నారు. వెలగపూడిలో రాజధాని రైతు ఐకాస ఆధ్వర్యంలో బీఆర్ నాయుడుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.'చంద్రబాబు సూచన మేరకు రాజధాని రైతులతో సమావేశమ య్యాను. విజయవాడ, రాజమహేంద్రవరంలో పాదయాత్రలో పాల్గొన్నా ను. అమరావతి లాంటి ఉద్యమం ఇప్పటి వరకు చూడలేదు. రాజధాని రైతులు, మహిళల కన్నీరులో వైసీపీ కొట్టుకుపోయింది. ఉద్యమం విజయవంతం అయినందుకు శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తున్నాం. ఈనెల 15న జరిగే కల్యాణంలో రైతులంతా పాల్గొనాలి' అని బీఆర్ నాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, జ్యోతుల నెహ్రూ, ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నాసా మిషన్ వాయిదా..
## సునీతా విలియమ్స్ రాక మరింత ఆలస్యం



**వాషింగ్టన్ :** మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ దాదాపు తొమ్మిది నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. ఆమెతో పాటు వెళ్లిన బచ్ విల్మోర్ కూడా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈక్రమంలో వారిని భూమిపైకి తిరిగి తీసుకొచ్చేందుకు నాసా-స్పేస్‌ఎక్స్‌లు ప్రయోగించిన క్రూ 10 మిషన్ వాయిదా పడింది. అమెరికాలోని ఫ్లోరిడా నుంచి నలుగురు వ్యోమగాములతో ఫాల్కన్ 9 రాకెట్ బయలుదేరేందుకు క్రూ 10 మిషన్ సిద్ధమైంది. ఈక్రమంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం నిలిచిపోయింది. హైడ్రాలిక్ సిస్టమ్‌లో సమస్య ఉత్పన్నం కావడంతో దీన్ని ఆపేసినట్లు నాసా పేర్కొంది. సమస్యను పరిష్కరించి ఈ వారంలో మరో ప్రయోగం చేయనున్నట్లు తెలిపింది. దీంతో వ్యోమగాముల రాక మరికొన్ని రోజులు ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో వారు ఐఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రణాళిక ప్రకారం ఐఎస్ఎస్‌లో ఉన్న వ్యోమగా ములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమిని చేరుకుంది. సునీతా విలియమ్స్, విల్మోర్ అప్పటినుంచి ఐఎస్ఎస్‌లోనే ఉంటున్నారు. వారిని తిరిగి తీసుకురావడానికి నాసా స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేస్తోంది. ఈ ఇద్దరు వ్యోమగాములను తీసుకురావాలంటే అంతకంటే ముందు కొందరిని ఐఎస్ఎస్‌కు పంపించాల్సి ఉంటుంది. ఈ ప్రయోగం చేపట్టడానికి స్పేస్ ఎక్స్ సమయం కావాలనడంతో ఈ ఆలస్యం జరిగిందని గతంలో అధికారులు పేర్కొన్నారు. ఇక సునీత విలియమ్స్, విల్మోర్ కొన్ని రోజుల క్రితం స్పేస్ నుంచి మీడియాతో మాట్లాడారు. తమకోసం మార్చి 12న స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ-10 అంతరిక్షనౌక రానుందని, నౌకలో కొత్తగా ఐఎస్-ఎస్‌లోకి వచ్చే వ్యోమ గాములు తమ బాధ్యతలు తీసుకోనున్నారని చెప్పారు. తర్వాత మార్చి 19న ఆ నౌకలోనే తిరిగి భూమి మీదకు తాము బయల్దేరనున్నామని తెలిపారు.

## టీడీపీ హయాంలోనే విద్యుత్ రంగంలో తొలి సంస్కరణలు

(మొదటిపేజీ తరువాయి)

ఘనత ఆ ప్రభుత్వా నిదన్నారు. రాష్ట్రంలో తలసరి విద్యుత్ వినియోగం 23 శాతం మేర పెరిగిందని సీఎం చెప్పారు. సౌర, పవన విద్యుత్‌ను 7700 మెగావాట్లు మేర ఉత్పత్తి చేసిన మొదటి రాష్ట్రం ఏపీ అని చెప్పారు. 2019-24 మధ్య అసమర్థ పాలనతో రాష్ట్రంలో మళ్లీ చీకటి రోజులు వచ్చాయన్నారు. ఆలోచన లేకుండా వైకాపా ప్రభుత్వం పీపీఏలను రద్దు చేసేసిందని.. ఆ విషయం అంతర్జాతీయ అంశంగా మారిపోయిందని గుర్తుచేశారు. దావోస్‌లోనూ దీనిపై చర్చ జరిగిందన్నారు. ఒక వ్యక్తి ఈగో కారణంగా రాష్ట్ర ఖజనా నుంచి రూ.9 వేల కోట్లు పీపీఏలకు చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## యువతలో ఏఐ నైపుణ్యాలకు మైక్రోసాఫ్ట్‌తో కీలక ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

అందిపుచ్చుకొని, ఉద్యోగావకాశాలు పొందేందుకు మైక్రోసాఫ్ట్ శిక్షణ ఉపకరిస్తుందని తెలిపారు. 50 ఇంజినీరింగ్ కాలేజీల్లో 500 మంది అధ్యాపకులకు మైక్రోసాఫ్ట్ శిక్షణ, 10వేల మంది విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటరింగ్ లో ట్రైనింగ్ ఇవ్వనుంది. అదే విధంగా 30 ఐటీఐల్లో 30 వేల మంది విద్యార్థులకు డిజిటల్ ప్రొడక్టివిటీలో శిక్షణ ఇవ్వనున్నారు. ఏపీలో యునిసెఫ్ భాగస్వామ్యంతో పాస్ పోర్ట్ టు ఎర్నింగ్ 2.0ని ప్రవేశ పెట్టేందుకు వీలుగా 40వేల మందికి, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ సహకారంతో మరో 20 వేల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ పౌర సేవలను మెరుగుపర్చడంతో పాటు ప్రభుత్వాధికారుల్లో సామర్థ్యం పెంపుదలకు 50 వేల మందికి 100 గంటలపాటు ఏఐ శిక్షణను అందిస్తుందని తెలిపారు. శాఖల మధ్య సహకారంపై స్వీయ-అభ్యసన మార్గాలు, వర్క్‌షాప్‌లు, వెబినార్‌ల ద్వారా 20వేలమంది మంది సిబ్బందికి ఏఐ అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌ను అందిస్తారు. ఆయా ప్రాంతాల్లో ఏఐ శిక్షణకు అవసరమైన భౌతిక మౌలిక సదుపాయాలను ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సమకూరుస్తుంది. ఏఐ శిక్షణ అందించడానికి ఆయా విభాగాలను సమన్వయ పరుస్తుంది. విద్యాసంస్థల్లో ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టేందుకు అవసరమైన శిక్షణ, సర్టిఫికేషన్ ను మైక్రోసాఫ్ట్ అందజేస్తుందని మంత్రి లోకేష్ చెప్పారు.

## మహాకుంభమేళాతో రైల్వేకు భారీ ఎత్తున ఆదాయం

(మొదటిపేజీ తరువాయి)

బదోనీ, సీనియర్ డీసీఎం హిమాన్షు శుక్లా తెలిపిన వివరాల ప్రకారం మహా కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని నార్త్ సెంట్రల్ రైల్వే జోన్‌లోని నాలుగు రైల్వే స్టేషన్లలో రూ.159.20 కోట్ల విలువైన టిక్కెట్లు అమ్ముడయ్యాయి. అలాగే ఉత్తర రైల్వేలోని లక్నో డివిజన్‌లోని మూడు రైల్వే స్టేషన్ల నుండి రూ.21.79 కోట్ల విలువైన టిక్కెట్లు అమ్ముడయ్యాయి. ఈశాన్య రైల్వేలోని వారణాసి డివిజన్‌లోని రెండు రైల్వే స్టేషన్ల నుండి రూ.6 కోట్ల విలువైన టిక్కెట్లను విక్రయించడం ద్వారా రైల్వేలు అధిక ఆదాయాన్ని ఆర్జించాయి. 2019 కుంభమేళాలో రైల్వేశాఖ 86 కోట్ల రూపాయల విలువైన టిక్కెట్లను విక్రయించింది. మహాకుంభ మేళాకు ఊహించనంత సంఖ్యలో భక్తులు తరలి వచ్చారని, అయితే రైల్వేశాఖ మూడేళ్లుగా ముందస్తు చర్యలు చేపట్టిన కారణంగా ఎక్కడా ఎటువంటి సమస్య రాలేదని డిఆర్‌ఎం హిమాన్షు బదోనీ తెలిపారు. ఇదిలావుండగా రైల్వేశాఖ 2031లో జరగబోయే కుంభమేళా కోసం ఇప్పటినుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకోసం మూడు రకాల ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయోధ్య, వారణాసి, మీర్జాపూర్, చిత్రకూట్‌లను కలుపుతూ రైళ్లను నడపాలని అధికారులు యోచిస్తున్నారు.

## గుంజీలు తీసిన హెడ్ మాస్టర్!

(మొదటిపేజీ తరువాయి)

తల్లిదండ్రులు కూడా సరైన క్రమశిక్షణలో పెడితే పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవ్వడంతో రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి వచ్చింది. హెడ్మాస్టరు గారూ! అంతా కలిసి పనిచేసి, ప్రోత్సాహం అందిస్తే మన ప్రభుత్వ పాఠశాలల పిల్లలు అద్భుతాలు సృష్టిస్తారు. వారిని దండించకుండా అర్థం చేసుకునేలా మీ స్వీయక్రమశిక్షణ చర్య ఆలోచన బాగుంది, అభినందనలు. అందరం కలిసి విద్యాప్రమాణాలు పెంచుదాం. పిల్లల విద్య, శారీరక, మానసిక వికాసానికి కృషిచేసి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని నారా లోకేశ్ అన్నారు.

## చంద్రయాన్-4కు మార్గం సుగమం!

(మొదటిపేజీ తరువాయి)

దేశంగా భారత్ నిలిచింది. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో ఈ ప్రయోగాలను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది. మార్చి 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇస్రో చీఫ్ వి.నారాయణన్ ఇటీవల వెల్లడించారు.

## ఏయూలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

అడిగిన ప్రశ్నలపై మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ... గతంలో జరిగిన అవకతవకలపై గౌరవసభ్యులు సభ దృష్టికి తెచ్చారు. మాకు అందిన సమాచారం ప్రకారం రూ.20 కోట్ల రూసా గ్రాంట్ దుర్వినియోగం, ఇస్రో నుంచి వచ్చిన రూ.25లక్షలను ఖర్చుచేసిన విషయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదు అందింది. అవినీతి, అధికార దుర్వినియోగం, విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించారని కూడా మా దృష్టికి వచ్చింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ విశాఖపట్నం వెళితే ఆయనకు స్వాగతం పలికేందుకు తరగతులు నిలిపేసి విద్యార్థులను రోడ్లపై నిలిపారు. ఏయూ రిజిస్ట్రార్ తో సహా ఇల్లీగల్ అపాయింట్ మెంట్స్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల నిర్వహణలో ప్రైవేటు కళాశాలల నుంచి లంచాలు తీసుకోవడం, మాజీ వీసీ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించడం, యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ల, ప్రిన్సిపాళ్లను నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగించడం వంటి తీవ్రమైన అభియోగాలు నాటి వైస్ ఛాన్సలర్ పై వచ్చాయి. దీనిపై ఇన్ చార్జి విసి ఒక కమిటీని నియమించి, అవకతవకలపై నివేదిక కోరారు. గౌరవ సభ్యుల విజ్ఞప్తి మేరకు 60రోజుల్లో విజిలెన్స్ ఎంక్వయిరీ పూర్తిచేసి, నివేదికను ప్రభుత్వానికి పంపించాలని ఆదేశిస్తున్నాం. విజిలెన్స్ నివేదికను గౌరవసభ్యులకు అందించే బాధ్యత నేను తీసుకుంటా. రిపోర్టు వచ్చిన వెంటనే వర్సిటీలో అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం, ఎవరినీ ఉపేక్షించేది లేదు, మరోసారి పొరపాటు చేయాలంటే భయపడేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి లోకేష్ చెప్పారు.

# ఏజీడీసీఓ పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానం



పాడేరు, (విశాఖ సమాచారమ్):- సమగ్ర శిక్షా, జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ (ఏ జి డి సి ఓ) పోస్టును నింపుటకుగాను అర్హత గల ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో పనిచేయుచున్న మహిళా స్కూల్ అసిస్టెంట్లు నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ వి ఏ స్వామి నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 13 నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. దరఖాస్తు లను 19 తేదీలోగా స్థానిక పిఎంఆర్సి భవనంలో ఉన్న సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. అర్హతకు సంబంధించిన వివరములు, దరఖాస్తు తదితర వివరములు సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు కార్యాలయం, అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి నేరుగా పొందవచ్చును. నింపబడిన దరఖాస్తులను పి.ఎం.ఆర్.సి. నందుగల సమగ్ర శిక్షా, జిల్లా ప్రాజెక్టు కార్యాలయంనందు .19న సాయంత్రం 5:00 గంటలలోగా అందజేయాలని పేర్కొన్నారు. అర్హులైన మహిళ స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేయాలని సూచించారు. రాష్ట్ర సమగ్ర శిక్ష పథక సంచాలకులు, జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఖాళీలను భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు.

## మాజీ వీసీపై విజిలెన్స్ కమిటీ
# ఏర్పాటు హర్షదాయకం




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఆంధ్ర యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ఆచార్య పి వి జి డి ప్రసాద్ రెడ్డి పై విజిలెన్స్ కమిటీ వేస్తున్నట్లు అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడంపై ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, పరిరక్షణ సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు మాజీ విసి పరిపాలన లో 2019-24 మధ్య జరిగిన అనేక ఆర్థిక అవకతవకలు, అన్యాయాలు, అక్రమాలపై విచారణ జరపాలని !సుదీర్ఘకాలంగా ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. అర్హతలేని ఫ్యాకల్టీని ఆంధ్ర యూనివర్సిటీలో అధ్యాపకులుగా తీసుకురావటం , నోటిఫికేషన్ లేకుండా పిఓపి , రూల్ ఆఫ్ రిజర్వేషన్ కి వ్యతిరేకంగా నియమకాలు, రిటైర్డ్ ప్రొఫెసర్లను అందలం ఎక్కించటం, నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్డీ అడ్మిషన్లు గైడ్ షిప్పులు ఇవ్వటం ఉంటే అనేక తప్పిదాలు ప్రసాద రెడ్డి హయాంలో జరిగాయని ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ కమిటీ సభ్యులు డాక్టర్ ఎం సురేష్ మీనన్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, డాక్టర్ దాస్ డాక్టర్ సూరి డాక్టర్ భాను తదితరులు తెలియజేశారు.

# మోడల్ పరీక్షలో రావికమతం
## మండల వాసి ప్రథమ స్థానం



రావికమతం, (విశాఖ సమాచారమ్):- అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు చోడవరంలో నిర్వహించిన మోడల్ పరీక్ష లో రావికమతం మండలం గుడ్డిప గ్రామానికి చెందిన విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచాడు.వివరాల ప్రకారం రావికమతం మండలం గుడ్డిప గ్రామపంచాయతీ సర్పంచ్ గుమ్మాల గణేష్ కుమారుడు గుమ్మాల జెడెక్ ఈ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు .దేంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి బాబ్జి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు వ్రాసేటప్పుడు విద్యార్థులలో నెలకొన్న భయాందోళనను పోగొట్టేందుకు గాను ఈ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు . అలాగే విద్యార్థులలో అంతర్గతంగా ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకుగాను ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి అన్నారు.అందులో భాగంగా ఈ మోడల్ పరీక్షను నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ పరీక్షలలో సుమారుగా 600 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో టాప్ టెన్ లిస్టు ప్రిపేర్ చేయడం జరిగిందనీ తెలిపారు.టాప్ టెన్ లిస్టులో ప్రథమ స్థానం రావికమతం మండలం గుడ్డిప గ్రామానికి చెందిన గుమ్మాల జెడెక్ ప్రథమ స్థానంలో నిలవడం జరిగింది అన్నారు. ఈ విద్యార్థి భాష్యం స్కూల్ నుంచి హాజరు అయ్యాడు అన్నారు. అలాగే రెండు నుండి10 వరకు బి. కార్తీక్ జడ్పీ హైస్కూల్ ,హార్దిక్ రామ్ రవి కాన్వెంట్, కే. యామిని జడ్పీ హైస్కూలు, ఎ. యజ్ఞశ్రీ జడ్పీ హైస్కూలు, తనీష్ మెహర చలపతి స్కూలు, అమీరున్నీస్ జడ్పీ గర్ల్స్ హైస్కూల్, శశివదన్ భాష్యం,నవీన్ ప్రకాష్ రవి కాన్వెంట్,లాస్య మధులిక చలపతి స్కూల్ నుంచి ఎంపిక అయినట్లు బాబ్జి తెలిపారు. ఈ పరీక్షలలో మొదటి 10 స్థానాలలో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి చోడవరం మండల విద్యాశాఖ అధికారి సింహాచలం చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది అన్నారు.


**దక్షిణ మధ్య రైల్వే**

దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in నందు కూడా చూడవచ్చును.

**బహిరంగ ఈ-టెండరు నోటీసు నెం. బి/ఈ.ఈజీఎస్/14/2024-25 తేది. 11.03.2025** PUB/0252/25

భారత రాష్ట్రపతి తరఫున దిగువ సంతకం చేసిన వారు దిగువ తెలిపిన పనులకు ఎదురుగా సూచించబడిన తేదీలలో గం. 15.00 వరకు ఈ-టెండర్లు ఆహ్వానించుచున్నారు.

1. బి/ఈ.29/I/ఈజీఎస్/38/2024-25 తేది.10.03.2025 పని పేరు : (1) బిజెడ్ఎ డివిజన్ : ఎడిఇఎన్/బిల్డింగ్స్/బిజెడ్ఎ పరిధిలో డివిజనల్ ఆఫీస్ ఈస్ట్ బ్లాక్ నందు సీనియర్ డీఎస్ఈ కార్యాలయమునకు మరమ్మత్తులు చేయుట మరియు రెండవ అంతస్తును కాన్ఫరెన్స్ హాల్‌గా మార్చుట. 2) బిజెడ్ఎ డివిజన్ :- ఎస్ఎస్ఈ/డబ్ల్యు/ఈస్ట్/ బిజెడ్ఎ సెక్షన్ నందు డివిజనల్ ఆఫీస్ ఈస్ట్ బ్లాక్ మరియు సౌత్ బ్లాక్‌లకు శిథిలమైన తలుపులు కిటికీలు టైల్స్ మార్చుట. 3) ఈఎల్ఎస్/బిజెడ్ఎ (డబ్ల్యుఎపి7&డబ్ల్యుఎజి9) లోకోమోటివ్ కొరకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే అదనపు ప్రతిపాదనలు- ఎలక్ట్రికల్ పనులు. పూర్తి చేయు కాలము: 12 నెలలు టెండరు విలువ: (రూ): 48,91,703/- ధరావత్తు./బిడ్ సెక్యూరిటీ (రూ.) 97,800/- టెండరు డాక్యుమెంట్ వెల : లేదు మూసివేయు తేది: 01.04.2025
2. బి/ఈ.29/I/ఈజీఎస్/39/2024-25 తేది.10.03.2025 పని పేరు : బిజెడ్ఎ డివిజన్ : గుల్లిపాడు (జిఎల్‌యు) స్టేషన్ నందు ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయుట మరియు విద్యుత్ సౌకర్యం కల్పించుట. పూర్తి చేయు కాలము: 12 నెలలు టెండరు విలువ: (రూ): 24,99,663.28/- ధరావత్తు./బిడ్ సెక్యూరిటీ (రూ.) 50,000/- టెండరు డాక్యుమెంట్ వెల : లేదు మూసివేయు తేది: 01.04.2025

1) ఔత్సాహిక టెండరుదారులు పై టెండరు మూసివేయు తేదీకి ముందు రోజు వరకు ఏవైనా సవరణలు/ మార్పులు చేయబడినవేమో తెలుసుకొనుట కొరకు మా వెబ్‌సైట్ "www.ireps.gov.in" సందర్శించవలసిందిగా సూచించడమైనది

డివిజనల్ రైల్వే మేనేజర్/ (ఎలక్ట్రికల్) విజయవాడ.

**బహిరంగ టెండరు నెం. బి-ఈ29-టీఆర్‌డీ-టీఎస్‌డీఆర్- 23-2024-25 తేది. 11.03.2025** PUB/0255/25

ఈ దిగువ పనులకు ఐఆర్ఈపీఎస్ టెండర్లను ఆహ్వానించుచున్నది.

పని పేరు : విజయవాడ డివిజన్- బిజెడ్ఎ డిఇఇఎన్ నందు జిడిఆర్ - బిజెడ్ఎ మరియు బిజెడ్ఎ డివిడి సెక్షన్ల ట్రాక్ రెన్యువల్ పనులకు సంబంధించి ట్రాక్షన్ యొక్క పోస్టులకు తొడుగులను పెంచుట. అంచనా విలువ: (రూ): 62,15,300.00/- పూర్తి చేయు కాలము: 12 నెలలు బిడ్ సెక్యూరిటీ (ధరావత్తు) (రూ.) 1,24,300/- మూసివేయు తేది: 04.04.2025 గం. 15.00 లకు. వ.నెం.1, టెండర్ ఫారం ధర (రూ.): లేదు

ఎస్ఆర్. డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ టిఆర్‌డి/విజయవాడ

**ఈ- టెండరు నోటీసు నెం. 459/డిఆర్‌డిఎం/డబ్ల్యు/జిఎన్‌టి** PUB/0256/25

ఈ దిగువ తెలిపిన పనులకు సంతకం చేసిన టెండర్లను 15:30 గంటలు 07.04.2025లోగా సమర్పించవలెను.

వ.నెం 1, టెండరు ఐడి : 2758 ఎస్ఆర్ డిఇఎన్/ డిఇఎన్ : పశ్చిమ పని వివరణ : కృష్ణా బ్రిడ్జి నందు 12x89.065మీటర్ల బోర్డర్ పైప్‌లైన్‌ను బహిరంగ వెబ్ గర్డర్‌కు మార్గం ఏర్పాటు చేయుట. మరియు కేసీసీ-బిజెడ్ఎ స్టేషన్లు మరియు కేసీసీ ఎంపిజీ స్టేషన్ల మధ్య నెం.1 & 1బి బ్రిడ్జిల నందు మార్గం ఏర్పాటు చేయుట. అంచనా విలువ: రూ. రూ: 2,97,06,653/- బిడ్ సెక్యూరిటీ రూ. 2,98,500/-

1. ఈ బిడ్లు సమర్పించడానికి చివరి తేది 07.04.2025 15:30 గంటలకు మరింత సమాచారం కొరకు వెబ్‌సైట్: www.ireps.gov.in లాగిన్ అవ్వండి.
2. ఏదైనా ఇతర సమాచారం/సవరణల కొరకు ఈ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు) గుంటూరు

**సవరణ నెం. ఈ-02-బిజెడ్ఎ-2025 తేది. 12-03-2025** PUB/0259/25

ఈ టెండరు ప్రకటన ఈ-05-సౌత్-బిజెడ్ఎ-2025 ఈ టెండరు నోటీస్ ద్వారా ఆహ్వానించబడిన డిఆర్ఎం పనులు/బిజెడ్ఎ/05/2025 నాటి పనులు 21-02-2025 తేదీన రద్దు చేయడమైనది. దయచేసి గమనించగలరు.

A0323 డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు) విజయవాడ

టెండరు షరతులు/వివరాలు/ నిబంధనలు, మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in లేదా http://www.scr.indianrailways.gov.in ను సందర్శించండి.


# కలెక్టర్ సుడిగాలి పర్యటన
## త్వరలో నవోదయం కార్యక్రమం



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- పాడేరు మండలంలోని పలు గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సుడి గాలి పర్యటన జరిపారు. ముందుగా అయినాడ గ్రామాన్ని సందర్శించి అక్కడ జల జీవన్ పనులను, సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. సచివాలయంలో ఎపి ఫైబర్ నెట్ సరిగా పనిచేయడం లేదని గుర్తించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న ఐదు వేల లీటర్ల నీటి సామర్థ్యం గల ట్యాంక్ ను గుర్తించి దానిని అవసరమైన ప్రాంతానికి తరలించి వినియోగం లోకి తీసుకు రావాలన్నారు. గ్రామంలో ఎక్కువగా సారాయి వల్ల మగ వారు చనిపోతున్నారని గ్రామంలోని మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా త్వరలోనే నవోదయం పేరుతో సారా నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని, మహిళలు సహకరించాలని కోరారు.రాయిపోలం గ్రామం సందర్శించి జల జీవన్ పనులు, రహదారి పనులు పరిశీలించిన కలెక్టర్ రహదారిని మే నెలాఖరులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. జే జే ఎం కింద మంజూరైన రూ.4.50 లక్షలతో వెంటనే పైపులు కొనుగోలు చేసి నీటి సరఫరా చేయాలని ఆదేశించారు.రహదారి నిర్మాణంలో ఫారెస్ట్ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. కొన్ని రహదారుల నిర్మాణాలలో కాంట్రాక్టర్లు మధ్యలో పనులు వదిలేసి పోతున్నారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా కాంట్రాక్టర్ల సమోదు ఆధారంగా వారి ట్రాక్ రికార్డు డాటా తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ అక్కడ రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసారు. ఫార్మసీని మందుల స్టోరేజ్ గదిని, పరిశీలించారు. కాలం చెల్లిన మందులను ముందుగానే గుర్తించాలని సూచించారు.ఆసుపత్రి నిర్వహణ సరిగా లేకపోవడమై అసంతృప్తి వ్యక్త పరచిన కలెక్టర్ స్వీపర్ ప్రసాద్ పై మండిపడ్డారు. అంబులెన్స్ కోసం చిన్న షెడ్ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మలక పొలం బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల రైటింగ్ సామర్థ్యాన్ని పరిశీలించి విద్యార్థులు ఆంగ్లం కర్సివ్ రైటింగ్ ను మెచ్చుకొని ఆంగ్ల ఉపాధ్యాయులు రామారావు ను అభినందించారు.బి.డి గ్రేడులలో ఉన్నవారిని ఎ. బి గ్రేడులకు తీసుకురావాలని, వారిపై ప్రత్యేక ద్రుష్టి సారించాలని ఆదేశించారు. అదే విధంగా స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను పరిశీలించి పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయుల పక్కనే కూర్చుని అత్యంత శ్రద్ధగా శిక్షణను విన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, బి, డి గ్రేడులలో ఉన్న విద్యార్థులు వెనుక బడటానికి గల కారణాలతో రిజిస్టర్ నిర్వహించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక ద్రుష్టి సారించాలని సూచించారు. టీచర్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఆదేశించారు. బెస్ట్ ప్రాక్టీసెస్ ను గుర్తించి ఒకరికి ఒకరు షేర్ చేసుకొని అవలంభించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో గ్రామీణ నీటి సరఫరా ఇఇ కే. జవహర్ కుమార్, హౌసింగ్ పిడి బి. బాబు,గిరిజన సంక్షేమ డిడి ఎల్ రజని, ఎఇ దుర్గా ప్రసాద్, తహసిల్దార్ త్రినాథరావు నాయుడు, ఎంపిటిసి ఎర్రయ్యమ్మ, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ భవనాలు నిర్మించాలి



అరకులోయ, (విశాఖ సమాచారమ్):- అరకువేలి మండలం సుంకరవాడ పంచాయతీలో గల పిరబంద గ్రామంలో అనేక మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు ఈ గ్రామంలో పిల్లలు చదువుకోవడానికి పాఠశాల అలాగే అంగన్వాడి కేంద్రం లాంటి భవనాలు లేకపోవడంతో ఎంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు సర్పంచ్ గిన్నెల చిన్నబాబు గతంలో ఇదే విషయంపై అనేకసార్లు పాడేరు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన స్పందన లేదని ఆయన వాపోయారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ గ్రామంలో మౌలిక సదుపాయాలతో పాటు అంగన్వాడి పాఠశాల భవనాలు నిర్మించాలని కోరుతునరు.. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర పండుగగా అనకాపల్లి నూకాంబికా జాతర
## ముఖ్యమంత్రి చంద్రబాబుకు రత్నాకర్ ధన్యవాదాలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మరియు యువ నాయకులు దాడి జైవీర్ అనకాపల్లి ప్రాంత ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీరు మొదట అమ్మవారిని దర్శించి ప్రభుత్వ ఉత్తర్వుల పత్రాలను అమ్మవారి పాదాలపై ఉంచి అమ్మవారిని దర్శించారు. వీరు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం నేడు ప్రభుత్వ ఉత్తర్వులు జీవో ఎమ్మెస్ నెంబర్ 85 ని విడుదల చేశారని దీని ద్వారా ఆంధ్ర రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాన్ని పెద్ద ఎత్తున రాష్ట్ర మొత్తం జరుపుకునే లాగా రాష్ట్ర పండుగగా ఉత్తర్వులు జారీచేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రమాణ స్వీకారానికి ముందే అమ్మవారిని దర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర పండుగగా చేయమని విజ్ఞప్తి చేసిన స్థానిక శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు రామకృష్ణ కి, పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పండుగను ఈ సంవత్సరం మార్చి 28వ తారీకు నుంచి నెలరోజుల పాటు జరుగుతుందని ఈ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తారని అన్నారు. రాష్ట్ర పండుగ అయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర , దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విచ్చేసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం కూడా జరుగుతుందని అన్నారు. ఈ ప్రాంత ప్రజలందరూ గర్వించదగ్గ విషయమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల విజయవాడ కనకదుర్గ అమ్మవారు, తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారు, అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారు, విశాఖపట్నం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాల లాగానే ఈ దేవాలయానికి కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రాముఖ్యత ఏర్పడుతుందని అన్నారు. ఈ ఉత్తర్వులకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో శిలపరశెట్టి బాబి,కర్రీ చిన్నాప్పలనాయుడు,కర్రీ అప్పాజీ,కోరిబిల్లి ఆరుద్ర, పి. స్.కే.నాయుడు.వేగి దొర బాబు,దొడ్డి రమణ,మొల్లి రమణ బాబు,కొణతాల పరదేశి నాయుడు,బుద్ధ శేఖర్,నదవరపు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ మండపానికి స్థల పరిశీలిన



కె.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- మండల కేంద్రంలో విఎంఆర్డీఏ కల్యాణ మండపం కోసం గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, అడిషనల్ కమిషనర్ రమేష్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణయ్ గోపాల్, రాష్ట్ర కొప్పులవెలమ అభివృద్ధి, సంక్షేమ చైర్మన్ పీవీజీ కుమార్, మాజీ శాసన సభ్యులు గవిరెడ్డి రామానాయుడు, జిల్లా అధికారులు, మండల అధికారులు, మండల కూటమి నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

మైనార్టీల సంక్షేమ శాఖ

మైనారిటీ వారికి నీట్ (యూజీ ) - 2025 ఉచిత కోచింగ్ .

మైనారిటీ విద్యార్థులు (ముస్లిం , బీసి - సి ( క్రిస్టియన్స్ ),సిక్కులు , బౌద్ధులు ,జైనులు , పార్శి )

వారికి ఉచితంగా కోచింగ్ ఇవ్వబడును. వెబ్సైట్ : www.apcednmwd.org. దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి తేదీ : 21-3-2025.

వివరాలకు 0866- 2970567 ఫోన్లో సంప్రదించండి.

## ఏపీ ఫైనాన్సియల్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలు



ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్సియల్ కార్పొరేషన్.. ఒప్పంద ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ డివిజన్ ఆఫీస్‌లో అసిస్టెంట్ మేనేజర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చు.

పోస్టు వివరాలు:

అసిస్టెంట్ మేనేజర్

**విభాగాల వారిగా ఖాళీలు:**

1. ఫైనాన్స్- 15 2. టెక్నికల్- 08 3. లీగల్- 07

**మొత్తం పోస్టుల సంఖ్య: 30**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/ సీఎంఏ/ ఎంబీఏ/ పీజీడీఎం (ఫైనాన్స్), బీటెక్, లా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ (ఎంఎస్ ఆఫీస్) పరిజ్ఞానం, ఉద్యోగానుభవం ఉండాలి. ఇంగ్లిష్, తెలుగులో రాయడం, మాట్లడటం వచ్చి ఉండాలి. ఆంధ్రప్రదేశ్ లోకల్ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

**జీతం:** నెలకు రూ.35,000.

వయోపరిమితి: 31.01.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.

**దరఖాస్తు ఫీజు:** జనరల్ రూ.590బీ ఎస్సీ/ ఎస్టీలకు రూ.354.

**ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది.

**ఆన్‌లైన్ టెస్ట్:** మే నెలలో

**పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, కర్నూలు, తిరుపతి, హైదరాబాద్.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

**దరఖాస్తు చివరి తేదీ:** 11.04.2025.

## టెన్త్ పాసైన విద్యార్థులకు శుభవార్త

ఇండియన్ రైల్వేస్ రైల్ వీల్ ఫ్యాక్టరీ వివిధ ట్రేడ్‌లలో అప్రెంటిస్ రిక్రూట్‌మెంట్ 2025 కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. రైల్ వీల్ ఫ్యాక్టరీ వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు అనేక అప్రెంటిస్ పోస్టుల కోసం నియామకాలను విడుదల చేసింది.ఈ నియామకంపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు మార్చి 1, 2025 నుండి ఏప్రిల్ 1, 2025 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నియామకం కింద, వివిధ ట్రేడ్‌లలో శిక్షణార్థులను ఎంపిక చేస్తారు.

**యూనిట్ వారీగా ఖాళీల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:**

ఫిట్టర్- 85, ఇంజనీర్-31, మెకానిక్ మోటారు వాహనం-8, టర్నర్-5, సిఎన్‌సి ప్రోగ్రామింగ్ కో-ఆపరేటర్ - 23,ఎలక్ట్రీషియన్-18,ఎలక్ట్రానిక్ మెకానిక్-22

**అర్హత వివరాలు**

ఈ నియామకం కింద 192 పోస్టులకు శిక్షణార్థులను నియమించుకుంటారు. ఇందులో వివిధ ట్రేడ్‌లకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు. అభ్యర్థులు 10వ తరగతి తప్పక ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత ట్రేడ్/బ్రాంచ్‌లో ఐటీఐ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.

దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థుల కనీస వయోపరిమితి 15 సంవత్సరాలు. గరిష్ఠ వయోపరిమితి 24 సంవత్సరాలు. రైల్వే రైల్ వీల్ ఫ్యాక్టరీ అప్రెంటిస్ రిక్రూట్‌మెంట్ నిబంధనల ప్రకారం రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఇవ్వబడుతుంది.

**ముఖ్యమైన తేదీలు**

రైల్వే రైల్ వీల్ ఫ్యాక్టరీ అప్రెంటిస్ రిక్రూట్‌మెంట్ 2025 కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మార్చి 1, 2025 నుండి తెరిచి ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు ఏప్రిల్ 1, 2025 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష రుసుము చెల్లించడానికి చివరి తేదీని కూడా ఏప్రిల్ 1, 2025గా నిర్ణయించారు. ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితా మరియు ఫలితాలు నియామక షెడ్యూల్ ప్రకారం విడుదల చేయబడతాయి. ఈ నియామకం కింద వివిధ ట్రేడ్‌లలో అప్రెంటిస్‌లను నియమిస్తారు.

**దరఖాస్తు రుసుము**

నియామక ప్రక్రియలో దరఖాస్తు రుసుము జనరల్, ఇతర వెనుకబడిన తరగతులకు రూ. 100లు. షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ, మహిళలకు దరఖాస్తు ఉచితం. పరీక్ష రుసుమును డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చు.

## కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు

గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రధానాచార్యులు మీనా తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి 21 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు న్నారు. 2 నుంచి 9వ తరగతి వరకు ఖాళీల మేరకు ఆన్లైన్లో ఏప్రిల్ 2 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విశాఖ సమాచారమ్

శుక్రవారం 14-3-2025

## పనివారికి 'సుప్రీం' అండ!

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత కూడా ఇంటి పని వాళ్లు ఎలాంటి చట్టాల అమలుకూ నోచుకోలేదు. కనీస వేతనాల చట్టం, పేమెంట్ ఆఫ్ వేజెస్ చట్టం. సమాన పనికి సమానవేతనం చట్టాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలలో భాగంగా దేశంలోని కోట్లాది మంది ఇంటి పనివాళ్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర బలహీన వర్గాలకు సంబంధించిన మహిళా కార్మికులతో పాటు బాలిక, బాల కార్మికులు కూడా లెక్కకు మించిన గంటలు పనిచేస్తూ.. వివక్షకు గురవుతూ అతితక్కువ ప్రతిఫలం అందుకుంటున్నారు. వారిపై దౌర్జన్యాలు, అత్యాచారాలు జరిగిన సంఘటనలు కూడా కోకొల్లలు . ఈ నేపథ్యంలో ఇంటి పని వాళ్లకు సమగ్ర సంక్షేమ చట్టం రూపొందించి నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

కేంద్ర ప్రభుత్వం కార్మిక మంత్రిత్వ శాఖ లేబర్ ఎంప్లాయిమెంట్ అనుబంధంగా ఉన్న అధికారులతో కమిటీ వేసి 6 వారాల లోపు ఇంటి పనివాళ్ల పనికి, రక్షణ, చట్టాలు అమలు కోసం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్య కాంత్, జస్టీస్ ఉజల్ భూయాన్, ఆదేశించారు. నిత్యం దోపిడీకి గురయ్యే ఇంటి పనివారు, కార్మిక కుటుంబాలలో ఈ ఆదేశం ఆశలు రేకెత్తించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కేంద్ర ప్రభుత్వం చట్టాలు చేస్తే వారి కుటుంబాలలో పనికి రక్షణ, పని భద్రత, కనీస వేతనం, గౌరవంతో పనిచేసే పరిస్థితులు సాధించే అవకాశం ఉంది. అయితే చట్టాలు చేస ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటే సరిపోదు. క్షేత్ర స్థాయిలో అది అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కూడా పాలకులపై ఉంటుంది, ఏదేమైనా సుప్రీంకోర్టు తీర్పు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలకు చెంపపెట్టు లాంటిది.

# రోబోటెక్ యుగం వస్తోంది బహుపరాక్

## కృతిమమేధ సంచలనాలు



మానవుడు తన జీవన పయనంలో మార్పులు చేసుకోబోతే ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ)వల్ల కష్టాలు తప్పవు.మానవుడిపై రోబోల ఆధిపత్యం తప్పదని నిపుణులు చెబుతున్నారు.ఈ కృతిమమేధ సంస్కృతి వల్ల మానవాళికి ముప్పు పొంచి ఉంది.ఇది ప్రపంచానికి సవాలుగా పరిణమించవచ్చు.ఇప్పటికే పెరిగిన సాంకేతికత వల్ల మానవునిమేధకు పని లేకుండాపోయింది. అన్ని పనులు యాంత్రికంగా మారాయి. డ్రోన్ లు మన నిత్యజీవితంలోకి ఇప్పటికే వచ్చాయి.పెళ్లి ఫోటోల దగ్గరనుంచి అన్ని పనులు చేస్తున్నాయి. వీటిని విధ్వంసకర పనులకూ ఉపయోగిస్తున్నారు. రోబోల రాజ్యం వస్తే మానవ జీవితం వందశాతం యాంత్రికంగా మారుతుంది.ప్రతి పని రోబోలు చేస్తే మానవుడి మెదడుకు పని ఉండదు.కొన్నాళ్లకు అది పనిలేక ఆలోచించడం మాని వేస్తుంది.దాంతో ప్రతి పనికి రోబో మీద ఆధారపడాల్సి వస్తుంది.

కృత్రిమ మేథ లో ఎలాన్ మస్క్ రూపొందించిన ప్రొగ్రాం మనిషి మెదడును నియంత్రించే అవకాశం ఉందని వెల్లడికావడంతో రాబోయే కాలంలో మరో ప్రమాదం పొంచి ఉంది.ప్రస్తుతం కృత్రిమ మేథ లో చైనా ముందున్న విషయం తెలిసిందే.ఇటీవల చైనా స్టారప్ కంపెనీ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ లో అమెరికా చాట్ జీపీటీని తలదన్నే సరిక్రొత్త టూల్ ను అభివృద్ధి చేసింది.దాంతో చైనా అమెరికా కంటే ముందున్న దనే విషయం విదితమే.చైనాలో పలు మోబైల్ సంస్థలు పూర్తి ఆటోమేషన్ సాధించాయి.ఒకవేళ కృత్రిమ మేథ లో చైనా ముందు ఉన్నట్లయితే మనుషులు ఆలోచనలను నియంత్రించడమే కాక జూలో జంతువులవలె బంధించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇదినిజంగా జరిగితే ఈ అభివృద్ధితో మానవుడు తన పతనం తాను సృష్టించుకోవడ మే అవుతుంది.ఇప్పటికే ప్రకృతితో ఆడుకుని వైపరీత్యాలు అనుభవిస్తున్నాడు.ఇకపై రోబోటెక్ వైపరీత్యాలు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి.

పారిశ్రామిక వాడల్లో రోబోలను ఉపయోగిస్తే మానవ తప్పిదాలకు అవకాశం ఉండదు. మానవప్రాణాలకు ఒక రకంగా రక్షణ కల్పించినట్లే. ఇటీవల తెలంగాణలో ఎస్ఎల్బీసీ లో జరిగిన సొరంగం ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన విషయం విదితమే.సొరంగం తవ్వకాల్లో రోబోలను మనుషుల బదులు ఉపయోగిస్తే ఇలాంటి దుర్ఘటనలకు తావుండదు.ఒకవేళ రోబో డామేజి అయితే మళ్లీ రిపేరు చేసే అవకాశం ఉంటుంది.అలాగే పనిగంటలు విషయంలో కేవలం ఎనిమిదిగంటల పరిమితి ఉండదు.అవి 24 గంటలు అందుబాటులో ఉంటాయి.ఒకే పనిని ఎక్కువ సార్లు చేయాల్సివస్తే రోబోలద్వారా సులభంగా చేయవచ్చు.

రోబోల తో పనిచేయించాలంటే పెట్టుబడి రూ.కోట్లలో ఉంటుంది.అదే మానవులు అతి చౌకగా అందుబాటులో దొరుకుతారు.ఖరీదైన వ్యవహారంగా ఉన్నా ఉత్పత్తి ప్రారంభం నుంచి ఒకే రకంగా ఉంటుంది.కాగా రోబోలు వాటికి ఇచ్చిన ప్రొగ్రాం మేరకే పనిచేస్తాయి.సృజనాత్మకత ఉండదు. కీలకమైన సమయంలో నిర్ణయం తీసుకునే అవకాశంలేదు.సమస్య వచ్చినప్పుడు క్రైసిస్ మేనేజ్మెంట్ అనేది ఉండదు.2015 సంవత్సరం నుంచి మల్టీనేషనల్ కంపెనీలు రోబేటిక్ ఆటోమేషన్ వైపు మొగ్గు చూపుతున్నాయి.కరోనా అనంతరం అవకాశాలను అందిపుచ్చుకుని ఆటోమేషన్ పెంచేసాయి.దాంతో మానవ ఉద్యోగాలకు కోతలు పడుతున్నాయి.

సాఫ్టు వేర్లో జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ వల్ల ముప్పు పొంచి ఉంది.కొత్తగా ఉద్యోగాలు చేరేవారికి ఇది ఒక ప్రమాదకర ముప్పుగా భావించవచ్చు.కేవలం ఐటీ మాత్రమే కాదు అన్ని ఉద్యోగాల్లో ఈ ప్రమాదం పొంచి ఉంది.న్యాయమూర్తులు లేక నత్తనడకన కేసులు నడవడం వల్ల న్యాయం సామాన్యుడికి అందుబాటులోకి రావడంలేదు.అండర్ ట్రైయల్స్ కేసులు తేలక జైళ్లలో మగ్గిపోతున్నారు. న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధ ప్రవేశపెట్టడం వల్ల కేసులు త్వరితగతిన తేలే అవకాశం ఉంటే భారత దేశం లాంటి దేశానికి ఈ సాంకేతికత మేలు చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు.వంద శాతం కేసులు త్వరిత గతిన తేలతాయి.

భారతదేశం వంటి 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో కృత్రిమ మేధ వల్ల ప్రమాదం భారీగా ఉండే అవకాశం ఉంది. చైనా నేడు అన్నిరకాల వస్తువుల ఉత్పత్తి లో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది.జనాభాకు తగ్గట్టు సదుపాయాలు, ఆహారం కొరత లేకుండా చేసుకుంది. ప్రపంచ మార్కెట్ లో అత్యధిక శాతం కైవసం చేసుకుంది. స్టారప్ కంపెనీలను ప్రోత్సహించడం ద్వారా కృత్రిమ మేధ లోనూ అమెరికాతో పోటీ పడుతున్నది. భారత్ అలాకాదు.లంచాలు ఇవ్వనిదే పని జరగదు.పనుల కేటాయింపులో బంధుప్రీతి చోటుచేసుకుంటుంది. అలాగే కులాలు, మతాల పట్టింపులు ఎక్కువ.ఇన్ని అడ్డంకులు దాటి ముందుకు పోవాలంటే చాలా కష్టం.ఇలాంటి పరిస్థితుల్లో భారత్లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ చోటు చేసుకుంటే అనర్థాలు ఎక్కువ జరిగే అవకాశాలు ఉన్నాయి.కాని కృత్రిమ మేథ ప్రవేశపెట్టాలంటే పెట్టుబడి అధికంగా పెట్టాల్సి ఉంది.ఇంత పెట్టుబడి పెట్టే కంపెనీలు భారత్లో అరుదే.ఈ ఒక్క కారణం వల్ల ఐరోపా,అమెరికా దేశాలు కంటే భారత్లో కృత్రిమ మేథ తొందరగా వచ్చే అవకాశం తక్కువని భావించాలి.ఏదిఏమైనా కృత్రిమ మేథ వల్ల లాభాలు కంటే దానివల్ల వచ్చే అనర్థాలు తట్టుకునేందుకు మాత్రం భారత్ యువ శాస్త్రవేత్తల పరిశోధనలను ప్రోత్సహించాలి.అప్పుడే మనగలుగుతాం.లేకపోతే మళ్లీ బానిస బతుకులు తప్పవు.ఇప్పుడు శారీరిక బానిసత్వం ఉండదు.మానసిక బానిసత్వం వస్తుంది.మానవుల మెదడును నియంత్రించే వ్యవస్థ వస్తే ఏ పనిచేయాలంటే ఆపని చేసి తీరాలి.ఈ ప్రమాదం నుంచి తట్టుకోవాలంటే ప్రభుత్వాలకు ప్రజలకూ ముందుచూపు ఉండాలి.రివర్స్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ను కూడా అభివృద్ధి పరచాలి.మిసైల్ శత్రుదేశంవేస్తే దాన్ని ఛేదించగల యాంటీ మిసైల్స్ తయారు చేస్తున్న నేటి రోజుల్లో కృత్రిమ మేథ వైపరీత్యాలను అధిగమించేందుకు రివర్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి చేయడంలో స్వీయరక్షణవిషయంలో తప్పులేదు.

(యం.వి.రామారావు, ప్రత్యేక ప్రతినిధి)

# బహుముఖ ప్రజ్ఞాశాలి సత్యజిత్ రే



సత్యజిత్ రే అనగానే "పథేర్ పాంచాలి, షత్రంజ్ కి కిలాడి" వంటి సినిమాలు ఎవరికైనా గుర్తుకొస్తాయి. ఆయన కేవలం వెండితెరకు మాత్రమే పరిమితమైన మనిషి కాదు. చరిత్రకారుడు, కథకుడు, కవి, వాణిజ్య ప్రకటనలకు ఒరవడి దిద్దిన సత్యజితే రే బహుముఖ ప్రజ్ఞాశాలి.

1921 మే రెండో తేదీన కలకత్తాలో రచయితల కుటుంబంలో పుట్టి పెరిగిన సత్యజిత్ రే గురుదేవుడు, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నెలకొల్పిన "శాంతి నికేతన్"లో కళలు నేర్చుకున్నారు. మనిషి ఊహాశక్తికి పదును పెట్టే బొమ్మలు చిత్రాలు చిత్రించారు. సినిమాలు తీశారు. కథలు రాశారు. ప్రాథమికంగా కళాకారుడు అయిన సత్యజిత్ రే జాతీయ స్థాయిసోనే కాకుండా అంతర్జాతీయంగానూ కీర్తిప్రతిష్ఠలు గడించిన ప్రతిభాశాలి. ఆయన తాతగారు ఉపేంద్ర కిశోర్ రే 'సందేశ్'అనే పిల్లల పత్రికను ప్రారంభించారు. అయితే అదే అనివార్యకారణాల వల్ల మధ్యలో ఆగిపోయింగి. దానిని సత్యజితే రే 1961లో పునరుద్దరించారు. పలు రకాల పనుల మధ్య ఆయన ఆ పత్రికలో అనేక కథలు, కవితలు, వ్యాసాలు రాశారు.

అంతటి సత్యజిత్ రే తన బాల్యంలో ఎన్నో అవస్థలు పడ్డారు. ఆయన మూడవ ఏట తండ్రి మరణించారు. ఆయన తొలి సినిమా పథర్ పాంచాలి. ఇది 1955లో విడుదలైంది. ఈ చిత్రం ఆయనకు ఏకంగా పదకొండు అంతర్జాతీయ బహుమతులు సంపాదించి పెట్టింది. ఆయన తన జీవితకాలంలో 36 చిత్రాలకు దర్శకత్వం వహించారు. వాటిలో ఫీచర్ ఫిలిమ్స్, డాక్యుమెంటరీలు, లఘు చిత్రాలు కూడా ఉన్నాయి. నిర్మాతగానూ ఆయన తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్న సత్యజిత్ రే హిందీలో ఏకైక చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ చిత్రం పేరు సత్రంజ్ కే ఖిలాడి. ఈ చిత్రం 1977లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

1992 ఏప్రిల్ 23న కన్నుమూసిన సత్యజిత్ రే పిల్లల కోసం రాసిన కథలను పెద్దలు కూడా ఎంతో ఆసక్తితో చదివేవారు.

అలనాటి భారత దేశ సినిమా పరిస్థితిని, సినిమా తీయడంలో దర్శకునిగా తన అనుభవాలను, కష్టాలను కళ్ళకు కట్టినట్లు రాశరు. అలాగే ప్రపంచ సినిమా పోకడలను, సమకాలికులైన కురొసవ, చాప్లిన్ వంటి ప్రముఖుల గురించి ఆయన రాసిన అభిప్రాయాలు అన్ని వర్గాల వారిని ఆకట్టుకున్నాయి. ఆయన రచన శైలికి ఓ ప్రత్యేకత ఉంది. ఎంతటి గొప్ప వాళ్ళైనా నిర్మొహమాటంగా విమర్శించేవారు. సినిమా చరిత్రలో మైలురాళ్ళు అనదగిన వ్యక్తులను, సంఘటనలు వివరిస్తూ ఆయన రాసిన పుస్తకానికి విశేష ఆదరణ లభించింది.


అరవై దెబ్బై ఏళ్ళ క్రితంనాటి చిత్ర నిర్మాణ పరిస్థితులను, సినిమా పరిభాషను గురించి ఆయన చేసిన వ్యాఖ్యలను గమనిస్తే ఈనాటికీ సినిమా వ్యవస్థ ఏ మాత్రం మారలేదని అర్థం అవుతుందంటారు విశ్లేషకులు. మూకీ చిత్రాల నుంచి శబ్ద చిత్రాలకు జరిగిన మార్పులలో శబ్దప్రాధాన్యత పెరిగి, దృశ్య ప్రాధాన్యత తగ్గిందని వాపోయినా, "స్టార్" నటుల కోసం కథలలో మార్పులు చేస్తున్నారని బాధపడినా, యూనియన్ విధానంపై వ్యంగ్యాస్త్రాలు వేసినా, స్టూడియో భారీ బడ్జెట్ సినిమాల పరాజయాల గురించి మాట్లడినా, అన్నీ ఈ నాటికీ వాస్తవాలుగా కనిపించి ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తాయి. ఆలోచింపజేస్తాయి కూడా.

ఆయన జాతీయ స్థాయిలో ఆరుసార్లు ఉత్తమ దర్శకుడిగా అవార్డులు పొందారు. మొత్తంమీద భారత ప్రభుత్వం నుంచి జాతీయ స్థాయిలో 32 అవార్డులు దక్కించుకున్న సత్యజిత్ రే 1992లో అకాడమీ అవార్డుతోపాటు తొలి భారతీయుడిగా ఆస్కార్ పురస్కారం కూడా అందుకున్నారు. సత్యజిత్ రే 1987లో ఫ్రాన్స్ అధ్యక్షుడి చేతులమీదుగా లెజియన్ ఆఫ్ హానర్ అవార్డు గెల్చుకున్నారు. ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం ఆయనను గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. చార్లీ చాప్లిన్ తర్వాత సినీ పరిశ్రమ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన రెండో వ్యక్తిగా చరిత్రపుటలకెక్కారు సత్యజిత్ రే.

గ్రాఫిక్ డిజైనర్ గానూ ఎన్నో ప్రముఖ పుస్తకాలకు ముఖ చిత్రం దిద్దిన సత్యజిత్ రే మన దేశ ప్రప్రథమ ప్రధాని జవాహర్ లాల్ నెహ్రూ రాసిన డిస్కవరీ ఆఫ్ ఇండియా పుస్తకానికి కూడా ముఖచిత్రం గీయడం గమనార్హం.

– యామిజాల జగదీశ్

## చరిత్రలో ఈ రోజు (మార్చి 14)





1793: ఒక నల్లజాతి బానిసను న్యూయార్క్ రాష్ట్రానికి బలవంతంగా తరలించి అమ్మేసిన తరువాత, అప్పర్ కెనడా లెఫ్టినెంట్ గవర్నర్ సిమ్కో మొదటిసారిగా బానిసల దిగుమతికి వ్యతిరేకంగా చట్టాన్ని ఆమోదించారు.

1664: సిక్కుల ఎనిమిదవ గురువు గురు హర్‌కిషన్ మరణం.

1879: ప్రఖ్యాత భౌతికశాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జననం.

1883: ప్రఖ్యాత తత్వవేత్త, రాజకీయ-ఆర్థికవేత్త, విప్లవ కారుడు కారల్ మార్క్స్ మరణం.

1888: అత్యధిక సర్క్యులేషన్ కల మలయాళ వార్తాపత్రిక మలయాళ మనోరమ ప్రారంభం.

1931: భారతదేశంలో తొలి టాకీ చిత్రం ఆలం ఆరా ముంబ్కెలో విడుదల.

1965: ప్రముఖ బాలీవుడ్ నటుడు, దర్శకుడు, నిర్మాత ఆమిర్ ఖాన్ జననం.

## పంచాంగం

శుక్రవారం 14-3-2025
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. పూర్ణిమ ప. 12.25 |
| నక్షత్రం | : పూర్వ ఫాల్గుణి ఉ. 6.20 |
| వర్జ్యం | : ప. 2.18 ల 4.06 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# సంగీత ప్రపంచంలో చెరిగిపోని సంతకం

## నేడు స్వరబ్రహ్మ కె.వి.మహాదేవన్ జయంతి



అయిదు దశాబ్దాల పాటు సినీ ప్రేక్షకులను రంజింపచేసిన ప్రఖ్యాత సంగీత దర్శకులు కె.వి. మహదేవన్ మార్చి 14, 1917 న తమిళనాడు లోని నాగల్ కోయిల్ లో జన్మించారు. వీరి పూర్తి పేరు కృష్ణన్ కోయిల్ వెంకటాచలం భాగవతార్ మహదేవన్. తండ్రి వెంకట చలం అయ్యర్. తల్లి లక్ష్మీ అమ్మాల్. నాలుగేళ్ల వయస్సులోనే చిన్నారి మహదేవన్ నాద స్వర విద్వాన్ రాజారత్నం పిళ్ళై దగ్గర శిష్యరికం చేశారు. తొలి రోజుల్లో నవాబ్ రాజా మాణిక్యం పిళ్ళై నాటక బృందంలో పనిచేశారు. అలాగే భూథపాడి అరుణాచలం కవి రాయర్ వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకుని కొన్ని కచ్చేరి లు ఇచ్చారు. ఏడవ తరగతి వరకు మాత్రమే చదివారు. 20 ఏళ్ల వయస్సులో మద్రాసు చేరి సంగీత దర్శకులు ఎస్ వి వెంకట్రామన్ దగ్గర అసిస్టెంట్ గా చేరారు. కొద్దికాలం లోనే తమిళ చిత్రం 'ఆనందన్ అగ్ని' (1942)పరీక్ష అనే చిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. తెలుగులో తొలిసారిగా 1958 లో "దొంగలున్నారు జాగ్రత్త" అనే చిత్రానికి స్వరాలు అందించారు మహదేవన్. 1962 లో మంచి మనసులు విడుదలై వీరికి మంచి పేరును తీసుకువచ్చింది. తెలుగులో ఆయనను స్వరపరచిన ప్రతి పాటలో తెలుగుదనం ఉట్టిపడుతుంది. ఆదుర్తి సుబ్బారావు తీసిన 'మూగ మనసులు' (1963) పాటలు నేటికీ మనసులను రంజింప చేస్తున్నాయి. 'పాడుతా తీయగా చల్లగా'......'ముద్ద బంతి పువ్వులో...మూగ కళ్ల ఊసులో'..., 'నా పాట నీ నోట పలకాలి సిలకా' వంటి పాటలు అందరి నోటా పలికించినవే. 'దసరాబుల్లోడు' పాటలు యువతరాన్ని ఓ ఊపు ఊపాయి. ఆయన ఏ పాటకు స్వర రచన చేసిన అదో స్వర మంత్రం లా వినిపించేది. వీరికి తెలుగు రాదు. సంగీతానికి భాష అనే ఎల్లలు లేవని నిరూపించిన వారిలో మహదేవన్ ఒకరు. ఈయనకు 82 ఏళ్లు దాటాక 'సహస్ర చంద్ర దర్శనం' వేడుక చేశారు. అధిక మాసాలలో కలిపి వెయ్యి పున్నమి చంద్రులను చూసిన వారికి ఈ వేడుక చేస్తారు. ఈయన సంగీత దర్శకత్వం వహించిన చివరి సినిమా 'కబీర్ దాస్' 2003 లో చనిపోయిన తరువాత విడుదలైంది. చనిపోక మునుపు చివరి సినిమా కె.విశ్వనాథం దర్శకత్వం వహించిన 'స్వాతి కిరణం'. తమిళంలో చివరి సినిమా 'మురుగన్ తనై' (1990) తెలుగులో దాదాపు 50 చిత్రాలకు ఆయన సంగీతాన్ని అందించారు. జూన్ 21, 2001 న ఆయన మృతిచెందారు. వీరు 1967, 1980 ల లో జాతీయ ఉత్తమ సంగీత దర్శకులు అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు అందుకున్న తొలి వ్యక్తి మహదేవన్.

–డా. జె.వి.ప్రమోద్ కుమార్
పైడిమెట్ట, 9490833108.

# సాయి అనంత స్వరూపం దర్శించాలి



సాయిబాబా మహా సమాధి అనంతరం ఆయన భౌతిక శరీరం మన దృష్టి నుంచి నిష్క్రమించినా,వారి అనంత స్వరూపం మాత్రం మనస్సులో ఎల్లప్పుడు నిలిచే ఉంది. సమాధి అనంతరం కొత్త లీలలు జరుగుతున్నాయి. వాటిని బట్టి బాబా శాశ్వతంగా ఉన్నారని,భక్తులకు గతంవలె కోరికలు తీర్చుతున్నారని తెలుస్తున్నది. బాబాను సమాధిచెందక చూసినవారు అదృష్టవంతులు, వారికి ప్రపంచ సుఖాలు, కోరికలు పట్ల మమకారం తగ్గకపోతే,వారి మనస్సులు భగవత్పరం కాకపోతే అది దురదృష్టమని చెప్పవచ్చు.అప్పుడే కాదు ఇప్పుడు కూడా బాబా ముందు హృదయ పూర్వకమైన భక్తి, బుద్ధి,ఇంద్రియాలు, మనస్సు బాబా సేవలో ఐక్యం కావాలి. వీటిలో కొన్నింటిని మాత్రమే లయచేసి, మిగిలినవి వేరే చోట సంచరించే నట్లు చేస్తే ప్రయోజనం లేదు.ఆత్మశుద్ధితో భక్తితో చేయాలి.

భార్యకు భర్త యందు గల ప్రేమ,భక్తుడు గురువు నందు చూపవలసిన ప్రేమతోపోలుస్తారు.కాని ఈ రెండు ఒకదానితో మరోకటి పోల్చడానికి వీలులేదు.జీవితపరమావధి పొందేందుకు కుటుంబసభ్యులు తోర్పడరు.ఆత్మ సాక్షాత్కారం దారిని మనమే వెతుక్కోవాలి.నిత్యానిత్యాల భేదాన్ని తెలుసుకుని,ఇహపరలోక విషయ వాంఛలను సృజించి బుద్ధిని,మనస్సును స్వాధీనం ఉంచుకొని మోక్షానికై కాంక్షించాలి.మన స్వశక్తి పై ఆధారపడి ప్రపంచం అబద్ధమని తెలుసుకొని నిర్వ్యామోహం పెంచుకోవాలి,క్రమంగా గురువే పరబ్రహ్మ స్వరూపమని,ఆయన ఒక్కరే నిజమని గ్రహిస్తాం.వారిని ప్రతి జీవరాశి లోనూ చూడగలం.అదియే అద్వైత భజనం.ఎప్పుడైతే మనం గురువుని, బ్రహ్మాన్ని హృదయపూర్వకంగా ధ్యానిస్తామో మనం వారిలో ఐక్యమై ఆత్మసాక్షాత్కారం పొందుతాం.గురువు నామం జపించుట,వారి స్వరూపం మనస్సులో ధ్యానించుట వల్ల ఆయనను సర్వజీవులలోనూ చూసే అవకాశం కలుగుతుంది.అదే మనకు శాశ్వతానందం కలుగజేస్తుంది.

– ఎం.వి.రామారావు

# మంచినీటి సౌకర్యానికి గ్రామస్తుల వినతి



రావికమతం, (విశాఖ సమాచారమ్):- మండలం లోని చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామం 3 కుటుంబాలు పి వి టి జి కొందు తెగ గిరిజనులు జీవనం సాగిస్తూ ఉన్నారు.మంచినీళ్ల కోసం గెడ్డ నీరును ఆశ్రయిస్తూ నీళ్ల తాగడంతో తరుచు పిల్లలకి అనారోగ్యం గురవుతున్నారు. మంచినీరు సౌకర్యం కల్పించాలని అనేకసార్లు అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు, ప్రధానమంత్రి జల్ జీవన్ మిషన్ పి.వి. టీ.జీ.కి ప్రత్యేక పథకం ఏర్పాటు చేసిన వారికి ఆ పథకాన్ని వర్తింప చేయలేదు.ఈ మధ్యకాలంలో గ్రామానికి కరెంటు సౌకర్యం కల్పించారు.మంచి నీటి సౌకర్యం కల్పించ వలసిందిగా వారు కోరు చున్నారు. తరచూ అనారోగ్యం గురవుతే డోలీలు కట్టుకొని చీమలపాడు పంచాయతీ కేంద్రానికి రావాల్సి వస్తుంది అని,రాష్ట్ర ప్రభుత్వం డోలీలను అరి కడతామని ఓ పక్క ప్రచారం చేస్తూ, మా గ్రామాలకి రోడ్ సౌకర్యం కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము అని గ్రామస్తులు తెలిపారు.ఈ కార్యక్రమం లో గెమ్మిలి శ్రీను, మర్రి చిలుకమ్మ,మర్రి గౌరి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు గత ప్రభుత్వంలో అన్యాయం



జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- వైఎస్సార్ ప్రభుత్వం నిరుగ్యోగులకు మోసం చేసి యువత పోరుబాట అంటారా? సం"ఒక జాబ్ క్యాలెండర్ అన్నారు, ఒక్క ప్రభుత్వ ఉద్యోగం లేదు , కూటమి ప్రభుత్వం ఈనెలలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుంది,జూన్ లో నియామకాలు పూర్తి చేస్తుంది. గత ప్రభుత్వం ఇప్పటికే 5 సం,వయోపరిమితి పోయింది ఇప్పుడు యువ పోరుబాట, అంట.గిరిజనులకు గుండె లాంటి జి ఓ ఎం ఎస్ నం 3 తిసేత్తే ఒక్క రివ్యూ పిటిషన్ వేయలేదు,కూటమి ప్రబుత్వం గిరిజనులకు పి వి టి జి ఉపకుల హౌస్ లకు రూ 100000, మిగతా ఉపకులకు 75000 రూపాయలు పెంచడం జరిగింది అని వీటిని అందరు వినియోగించాలని కోరుకుంటున్నాము అని రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాద్యక్యులు సోమెలి చిట్టిబాబు,తెలుగు యువత అధ్యక్యులు కొండలరావు, రైతు విభాగ అధ్యక్షులు బాబురావు, సింహాచలం పాల్గొన్నారు.

## వివాద స్థలాన్ని సామాజిక కార్యక్రమాలకు వినియోగించుకోవాలి



కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- లంకవానిపాలెం గ్రామంలో 98 సెంట్లు విస్తీర్ణం గల భూమిపై ఆ గ్రామానికి చెందిన మహిళలు మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని గురువారం కలసి ఆ స్థలం దురాక్రమణ గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సదరు స్థలాన్ని గ్రామస్తులంతా సామాజిక కార్యక్రమాలకు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బండారు సూచించారు. గ్రామానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు ఆ స్థలాన్ని దురాక్రమించాలని చూస్తున్నారని ఎమ్మెల్యే కు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగానే అక్కడ రెండు బడ్డీలను ధ్వంసం చేశారని గుర్తు చేశారు. ఎప్పటి లాగానే ఆ స్థలాన్ని సామూహిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి పోలీసులు దేవాదాయ శాఖ అధికారులతో తాను మాట్లాడతానని గ్రామస్తులకు ఎమ్మెల్యే బండారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు కొరుపోలు చిన్నమ్మలు దేవుడమ్మ రామకృష్ణ వరలక్ష్మి నాగమణి డెక్క పైడితల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్‌లో రిటైర్డు రైల్వే ఉద్యోగుల పున నియామకం సూచిక ప్రకటన**

వివరణాత్మక నోటిఫికేషన్ నెం. WPT/5/Rect/Re-engagement/Non-Gaz తేదీ. 07.03.2025 ఈస్ట్ కోస్ట్ రైల్వే వారి వెబ్‌సైట్ నందు ఈ క్రింది విధంగా లభిస్తుంది. www.ecor.indianrailways.gov.in ⊃ మా గురించి ⊃ డివిజన్ ⊃ వాల్తేరు డివిజన్ ⊃ రిక్రూట్‌మెంట్.

PR-1084/P/24-25 డివిజనల్ రైల్వే మేనేజర్ (పర్సనల్), వాల్తేరు


# గ్లూకోమా వ్యాధితో కంటి చూపుకు ప్రమాదం

కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- ప్రతి ఆరు నెలలకు ప్రతి ఒక్కరూ కలలకు పరీక్షలు నిర్వహించుకోవాలని విజన్ టెక్నీషియన్ సాయికుమార్ కోరారు. గ్లూకోమా వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి తనిఖీ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కంటి చూపుపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధి ఉన్నవారు కంటిచూపు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్లూకోమా వ్యాధి తీవ్రతతో కంటిచూపు పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా హై స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ పద్మావతి ఉపాధ్యాయులు కొరతం ఈశ్వరరావు మండల మురళీకృష్ణ సంఘమిత్ర రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతిరావు ఫీల్డ్ వర్కర్ సంతోషి పాల్గొన్నారు.

# హోలీ ముందస్తు వేడుకలు




కె.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- ముందస్తు హెూలీ సంబరాలు ఇక్కడి అయ్యన్న విద్యాసంస్థలలో గురువారం అంబరాన్ని అంటాయి. ముఖ్యంగా చిన్నారుల సందడితో విద్యాసంస్థల ప్రాంగణం పండగ వాతావరణంలో కళకళలాడింది. రంగు,రంగుల వేడుక హెూలీ సందర్భంగా చిన్నారులు తమ చిట్టిచిట్టి చేతులకు పలు వర్ణాలను పూసుకొని కేరింతల కొడుతూ వేడుకలో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. హ్యాపీ హెూలీ అంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ డివిజన్లో రైల్వే భద్రతా తనిఖీలు



విజయవాడ, (విశాఖ సమాచారమ్):- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ విజయవాడ డివిజన్‌లోని కాకినాడ-సామర్లకోట-రాజమండ్రి-నిడదవోలు-ఏలూరు సెక్షన్‌ను తనిఖీ చేశారు. ఆయనతో పాటు విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర పాటిల్, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. జనరల్ మేనేజర్ కాకినాడ పోర్ట్ రన్నింగ్ రూమ్‌లో తనిఖీని ప్రారంభించారు. అక్కడ ఆయన లోకో సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పచ్చని వాతావరణాన్ని ప్రోత్సహించడానికి ఆయన రన్నింగ్ రూమ్ వద్ద మొక్కలు నాటారు. ఆయన సామర్లకోట రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అక్కడ ప్రయాణీకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయం, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని కూడా ఆయన పరిశీలించారు. అరుణ్ కుమార్ జైన్ రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని ప్రయాణీకుల సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని ఆయన సమీక్షించారు. గోదావరి రైల్వే వంతెనను క్షుణ్ణంగా పరిశీలించి, వంతెన, రైలు పట్టాల భద్రతా అంశాలను సమీక్షించారు. జనరల్ మేనేజర్ నిడదవోలు రైల్వే స్టేషన్‌కు వెళ్లి, అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా స్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ తనిఖీ సమయంలో పలువురు ప్రజాప్రతినిధులు జనరల్ మేనేజర్‌ను కలుసుకుని తమ ప్రాంతానికి సంబంధించిన రైలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రాతినిధ్యాలను సమర్పించారు. తరువాత జనరల్ మేనేజర్ కి.మీ. నంబర్ 528/2 వద్ద ఉన్న లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 368ను తనిఖీ చేసి అక్కడ భద్రతా అంశాలను సమీక్షించారు. రికార్డులను పరిశీలించారు. జనరల్ మేనేజర్ ఏలూరు రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్కడ అందుబాటులో ఉన్న ప్రయాణీకుల సౌకర్యాలను, వసతులను సమీక్షించారు.

# బీజేపీ కార్యకర్తల సమావేశం





దేవరాపల్లి: (విశాఖ సమాచారమ్): దేవరపల్లి మండల కేంద్రంలో గురువారం భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాడుగుల పరిశీలకుడు దొగ్గ ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో స్థానిక రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు అప్పలకొండ కుమార్ , మాజీ మండల అధ్యక్షుడు గొర్లి నాయుడు బూత్ స్థాయి మండల అధ్యక్షుడు గంగాధర్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి పరవాడ , మండల మాజీ అధ్యక్షుడు రొంగలి నారాయణమూర్తి, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా కార్యకర్తలు తమతమ మనోభావాలను పార్టీ పరిశీలకుని ఎదుట విన్నవించుకున్నారు. ద పరిశీలకుడు ఈశ్వర ప్రసాద్ స్పందిస్తూ ఇకనుండి మండలంలో ఏ కార్యకర్తకు సమస్య వచ్చినా తమ దృష్టికి తీస్నువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాడుగుల నియోజకవర్గంలో నిరంతరం అందుబాటులో ఉంటూ కష్టపడతానని పేర్కొన్నారు.

# హాల్ టికెట్ల పేరుతో విద్యార్థులను వేధిస్తే చర్యలు

## రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- ఈ నెల 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల హాల్ టికెట్ల జారీలో ఫీజులు పెండింగ్ లో ఉన్నాయన్న నెపంతో జిల్లాలో పలు ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లలో స్కూల్ ప్రిన్సిపాల్ సంతకాలు,స్టాంపులు ఉండాల్సిందేనన్న నిబంధనలు పెట్టి విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కు ఫిర్యాదులు అందడంపై సీరియస్ గా తీసుకుంటున్నట్టు కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు,గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యాలు ఫీజులుపై ఈ సమయంలో ఒత్తిడిని పెంచడం సమంజసం కాదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు సూచనలు జరీచేసిందని గుర్తు చేశారు,ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆన్లైన్ లో హాల్ టికెట్ల జారీ ప్రక్రియ మొదలు పెట్టిందని గుర్తు చెప్పారు,ఈ హాల్ టికెట్లతో నేరుగా జిల్లాలోని విద్యార్థులు నిరభ్యంతరంగా పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు వ్రాయవచ్చని అన్నారు,ఈ విషయంలో వారి తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని సూచించారు,అలాగే ప్రభుత్వం ఆన్లైన్ హల్ టికెట్ల జారీపై తమ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు వివిధ రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు,ప్రచార,ప్రసార సాధనాలు ద్వారా విస్తృత పరచాలని ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు,ఇంకా ఈ హాల్ టికెట్ల జారీ పేరుతో యాజమాన్యాలు గందరగోళ పరిస్థితులు సృష్టిస్తే తమ కమిషన్ చట్ట ప్రకార చర్యలతో పాటు ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి,ఆయా జిల్లాల కలెక్టర్లు,ఉన్నతాధికారులకు వివిధ సిఫారసులు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీతారాం చెప్పారు,సమస్యలుంటే apscpcr2018@gmail.com ఫిర్యాదులు చేయవచ్చని సీతారాం చెప్పారు.

## పాలిటెక్నిక్ విద్యతో ఆగిపోకుండా ఉన్నత విద్య వైపు అడుగులు వేయండి



చింతపల్లి, (విశాఖ సమాచారమ్):- సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యతోనే విద్యను ఆపకుండా ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు వేడుకలు చింతపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి మాట్లాడుతూ విద్యార్థులు పాలిటెక్నిక్ విధ్యతోనే ఆగిపోకుండా ఉన్నత విద్య అయిన ఏజీ బీఎస్సీ., సీట్లు సాధించాలని సూచించారు. ప్రతి యేట మన సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ అగ్రిసెట్‌లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుస్తుందని, ఈ ఏడాది కూడా ప్రథమ స్థానం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డా. కె. బయ్యపు రెడ్డి, ఓఏఎం డా. పి. బాల హుస్సేన్ రెడ్డి., ఓఎస్ఓ, బి. ఎన్. సందీప్ నాయక్., వార్డెన్ జోగారావు., పాలిటెక్నిక్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# మొల్లమాంబ స్ఫూర్తిగా ప్రతి మహిళా చదువుకోవాలి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి మహిళ చదువుకోవాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొల్లమాంబ జయంతి వేడుకలలో మొల్లమాంబ చిత్రపటానికి జిల్లా కలెక్టరు పూలమాలవేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ భారతదేశంలో మహిళలను విద్యకు దూరం చేసారనే భావనను చెరిపేస్తూ 14వ శతాబ్దంలోనే కవయిత్రి మొల్ల సంస్కృతం అభ్యసించారని జిల్లా కలెక్టరు తెలిపారు. మహిళా దినోత్సవం జరుపుకున్న కొద్దిరోజులలోనే మహనీయురాలు మొల్లమాంబ జయంతి జరుపుకోవడం, ఆమెను గురించి తెలుసుకోవడం అదృష్టమన్నారు. సంస్కృతంలో గల రామాయణాన్ని తెలుగువారి కోరికమేరకు తెలుగులోనికి అనువదించి మొల్ల రామాయణంగా ప్రసిద్ధిచెందిందని తెలిపారు. కవయిత్రి మొల్లమాంబ చదువుకొని తను కోరిన విధంగా జీవించారని, ప్రతి మహిళ ఆమెను స్ఫూర్తిగా తీసుకొని చక్కగా చదువుకోవాలని, కోరుకున్న ఉన్నత స్థానానికి చేరుకోవాలని తెలిపారు. కుటుంబంలో ఆడపిల్లలకు వారి కోరికలు, కళలు తీర్చుకొనే అవకాశం, నచ్చిన రంగాన్ని ఎన్నుకొని రాణించే అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టరు తెలియజేసారు.

ఎ.పి.గవర సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషను చైర్మన్ ఎం. సురేంద్ర మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కుమ్మరి కులంలో పుట్టి సంస్కృతం చదువుకొని రామాయణాన్ని తెలుగులో రచించి కుమ్మరి కులానికే గౌరవం తీసుకువచ్చారని తెలిపారు. ఆటువంటి మహనీయరాలి చరిత్రను భావితరాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కుమ్మరి, శాలివాహన సంఘ సభ్యులు అప్పలకొండ, సత్యనారాయణ మొల్లమాంబ జీవిత చరిత్ర గురించి తెలియజేసారు.జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలమేరకు కవయిత్రి మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో బి.సి.సంక్షేమశాఖ వసతిగృహ అధికారులు, సంఘ సభ్యులు కె. గుండప్ప, సిహెచ్. దుర్గాప్రసాద్, ఎస్. అప్పారావు, కె. శేషగిరిరావు, డి. అప్పలరాజు, ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..

# పెదపూడి రాజుపాలెం తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- బుచ్చయ్యపేట మండల పెదపూడి రాజుపాలెం గ్రామ ప్రజల తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతూ ఉండేవారు రాజకీయ నాయకులు వాళ్ళ పడే కష్టాలు వచ్చి చూసేవారు వాగ్దానాలు ఇచ్చేవారు వెళ్ళిపోయేవారు ఏళ్ల తరబడి ఆ సమస్య ఆ గ్రామంలో అలానే ఉండిపోయింది స్థానికుల తో వాళ్ళ యొక్క త్రాగునీటి సమస్యను తెలుసుకొని శాశ్వత పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో మండల జడ్పిటిసి దొండ రాంబాబు తమ సొంత నిధులతో బుచ్చయ్యపేట మండల పెదపూడి శివారు, రాజుపాలెంలో గురువారం మంచి నీటి బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చెయ్యడం జరిగింది. చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నా త్రాగు నీటి సమస్యకు పరిష్కారం చూపిన జడ్పీటీసీ సభ్యులు దొండా రాంబాబుకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు కుంచం ప్రకాశ్ రావు ,మాజీ జడ్పీటీసీ సభ్యులు సాగిరాజు వెంకటాపతిరాజు ,పెదపూడి గ్రామ సర్పంచ్ గోకివాడ వరకృష్ణ,వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు అయితి నాయుడు,సా భగవాన్, చందక అప్పలస్వామి నాయుడు, వార్డ్ మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# 'పది'లో ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- వడ్డాది కేపీడి జెడ్పీ హైస్కూల్లో గత ఏడాది టెన్త్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతిభావంతులకు పూర్వ విద్యార్థులు గురువారం నగదు పురస్కారం అందజేశారు.1969 నుండి ఇప్పటివరకు ఈ హైస్కూల్లో చదువుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల అసోసియేషన్ గా ఏర్పడ్డారు. ఈ అసోసియేషన్ నుండి ప్రతి సంవత్సరం పది మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పూర్వ విద్యార్థులు హైస్కూల్లో సమావేశమై నగదు పురస్కారం అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బి. నాగేశ్వరి, అడపా హర్ష, గేదెల అమృతలకు రూ. 8వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున అందించారు. అదే విధంగా మరో ముగ్గురు పేద విద్యార్థులు కుబిరెడ్డి మానస, సకలా కార్తీక్,పప్పల మృదులకు రూ.5 వేలు చొప్పున నగదు పురస్కారం అందించారు. విద్యార్థులను ఆశీర్వదించి ఉన్నత స్థానాలకు చేరుకో వాలని ఆకాంక్షించారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు, ఎస్వీ రమణ, కోవెల రవి, గౌరవాధ్యక్షుడు కోవెల జనార్ధనరావు, ఉపాధ్య క్షులు ఎస్ వరహాలు బాబు, దాడి గోవింద, సుసర్ల హరికుమార్, కోశాధికారి ఎస్ భాస్కరరావు, గరికిపాటి మేఘారావు, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

## రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సక్రమంగా, సకాలంలో సరుకులు అందజేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి అధికారులను ఆదేశించారు. ఆమె జిల్లాలోని ఎం.ఎల్.ఎస్. పాయింట్లు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మెబైల్ పంపిణీ వాహనం,సాంఘిక సంక్షేమ వసతిగృహంల ను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. పంపిణీ ప్రక్రియలో పొరపాట్లు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి ఇతర అధికారులతో కలిసి రేబాక మండలం స్టాకు పాయింటును తనిఖీ చేసి స్టాకు,నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసారు.అనంతరం తుమ్మపాలలో రేషను షాపు మరియు మొబైల్ పంపిణీ వాహనాన్ని తనిఖీ చేసారు.స్టాకు వివరాలు తనిఖీచేసి, కార్డుదారుల వివరాలు అడిగి తెలుసుకుని,సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని సూచించారు. కార్డు దారులతో మాట్లాడి సరుకులు పంపిణీ గూర్చి తెలుసుకున్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య పొందుతున్నవారితో మాట్లాడి వారి అభిప్రాయాలను,సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరువాత కశింకోట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం సందర్శించి ఆహారం నాణ్యతను తనిఖీ చేసి,అక్కడ విద్యార్థినులకు కల్పిస్తున్న వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం తాళ్లపాలెం లో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం సందర్శించి, విద్యార్థుల విద్యాభ్యాసం, 2023-24లో ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత స్థాయిని ప్రధానోపాధ్యాయురాలిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.గురుకులం లోని భోజన శాల, వంటశాలను పరిశీలించారు. బాలికలకు అందిస్తున్న ఆహార నాణ్యత గూర్చి విద్యార్థినులు పిర్యాదు చేయగా, విద్యార్థినులకు మంచి నాణ్యమైన ఆహారం అందించాలని, విద్యార్థులకు మంచి వసతులు కల్పించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థినులతో మాట్లాడుతూ వసతి గృహాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని, బాలికలు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో సివిల్ సప్లై, మహిళా, శిశు అభివృద్ధి,పాఠశాల విద్య, ఫుడ్ సేఫ్టీ,తూనికలు & కొలమానాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జీడీ పిక్కల మద్దతు ధర కోసం గిరిజన రైతుల ఆందోళన

## 24,25 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాలు వద్ద ధర్నాలు




**దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):-** జీడీ పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని ఈనెల 24.,25 తేదీలో జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాలు వద్ద ఆందోళన చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దోర పేర్కొన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం గర్సింగి పంచాయతీ లోలి నాలుగు గిరిజన గ్రామాలకు చేందిన గిరిజన రైతులు ఎలాం బైల్ లో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు, అనంతరం వారు మాట్లాడారు.

జీడి పిక్కల మద్దతుధర కేజీ పిక్కలకు రూ.200/-లు ఇవ్వాలని ఆర్.బి.కె.ల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వరి,చెరకు, పత్తి మొదలగు పంటలకు మద్దతు ధర ప్రకటిస్తుందని. కాని జీడి పంటకు మాత్రం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు మార్కెట్ సౌకర్యం కల్పించక పోవడం ధర కూడా నిలకడగా ఉండక పోవడం జీడిపిక్కల పంట సమయంలో వ్యాపారులు ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు వ్యాపారుల చేతికి జీడిపిక్కలు చేరిన తరువాత అమాంతంగా జీడి ధర పెరుగుపోతుందని తెలిపారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేసారు.జీడి పిక్కల ధర ప్రభుత్వం శాస్త్రీయంగా నిర్ణయించి అమలుచేయక పోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నారని తెలిపారు.జీడి రైతులను మోసగిస్తున్నారని తెలిపారు ప్రస్తుతం 80 కేజీల జీడి పిక్కల బస్తాకు వ్యాపారులు రూ. 8,000/-మాత్రమే చెల్లిస్తున్నారని దీంతో జీడి రైతులు వ్యాపారుల చేతిలో దోపిడీకి గురి అవుతున్నారని అన్నారు. జీడిపప్పు బస్తా 80 కేజీలు పిక్కలకు 22 కేజీలు పప్పు వస్తుందని తెలిపారు మరో 3 కేజీలు ముక్కలు, తొక్కలు ఒక బస్తాకు 50 కేజీలు వస్తాయని. దీని ప్రకారం ప్రస్తుత మార్కెట్లో ధరల ప్రకారం సుమారు బస్తాకు రూ.19,400/- లు ఆదాయం వ్యాపారులకు వస్తుందన్నారు. ప్రోసెసింగ్ ఖర్చు బస్తాకు రూ.2,000/-లు, రైతుకు చెల్లించే రూ.16,000/- లు కలిపి మొత్తం రూ.18,000/-లు ఖర్చులకు పోగా ఒక బస్తాకు రూ.1900/- లు వ్యాపారులకు మిగులుతుందని తెలిపారు మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జీడి రైతులకు న్యాయమైన ధర చెల్లించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు మన దేశంలో జీడి సాగులో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో 70 వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారని సుమారు 80 వేల మందికి పైగారైతులు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. 25 వేల మెట్రిక్ టన్నులు జీడి పిక్కలు ఉత్పత్తి జరుగతుందని. నాన షేడ్స్ గిరిజన, తీర ప్రాంతంలో నీటి వనరులు లేని మెట్ట ప్రాంతంలో జీడి పంట ప్రధానమైన వాణిజ్య సాగుగా రైతులు భావిస్తున్నారని. జీడి పంట విస్తరణ, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెట్టాలని. జీడి రైతుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి. వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదలకుండా జీడి పిక్కల గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు ఈకార్యక్రమంలో అదికసంఖ్యలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

# 219 మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్ రెన్యువల్ ప్రతి పాదనలకు ఆమోదం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ విజయ క్రిష్ణన్ వారి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహించుచున్న 219 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ రెన్యువల్ ప్రతిపాదనలను ఆమోదించడం జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్య నారాయణ రావు తెలిపారు. కలెక్టరేట్లోని తన ఛాంబర్లో డిస్టిక్ రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సంబంధించిన విషయాలను చర్చించడం జరిగిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఐ ఎన్ పి ఆర్ వారి ఉత్తర్వులను అనుసరించి అక్రిడేషన్ కలిగి నేటికీ ఆయా సంస్థల్లో పనిచేయుచున్న మీడియా ప్రతినిధుల వివరాలు మీడియా సంస్థల యాజమాన్యాల నుండి డి పి ఆర్ ఓ కార్యాలయానికి నేటి వరకు అందిన లేఖల ద్వారా 219 మంది ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు మరో మూడు నెలలకు (తేదీ ఒకటి 1-3-2025 నుండి 31-5-2025 వరకు) అక్రిడేషన్ రెన్యువల్ కు ఆమోదం తెలపడం జరిగిందని తెలిపారు.కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు ఇప్పటి వరకు రెన్యువల్ కై లేఖలు అందజేయని మీడియా సంస్థలు లేఖలు అందజేయడానికి ఈనెల 20వ తేదీ ఆఖరి గడువుగా నిర్ణయిస్తూ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కె.చంద్ర రావు, వి.లోవరాజు,టి.రమేష్, హౌసింగు పథక సంచాలకులు వై.శ్రీనివాస్, వై.ఎస్.ఆర్. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ రంజిత్,ఆర్.టి.సి , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డైట్‌కు ఐఎస్‌ఓ ప్రామాణిక ధ్రువీకరణ




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కు ఐ ఎస్ ఓ ప్రామాణిక ధ్రువీకరణ. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రత్నాకర్ మాట్లాడుతూ అనకాపల్లి 2006వ సంవత్సరంలో ప్రారంభించబడి ఇప్పటికీ 19 సంవత్సరాల సుదీర్ఘమైన నాణ్యమైన విద్యాభ్యాసాన్ని విద్యార్థులకు అందించడం జరుగుతోంది .

అందులో భాగంగా అనేక అక్రిడిషన్లు ఎప్పటికప్పుడు పొందడం ఇప్పటికే నేక్ అక్రిడిషన్, అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హొదాతో విద్యా విధానంలో మరిన్ని నూతన వరవడికి శ్రీకారం చుట్టి అనేక మైనటువంటి విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చి విద్యార్థులకి ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీకి అనుగుణంగా విద్యా బోధనను అందిస్తునాం. అందులో భాగంగానే ఐఎస్ఓ సర్టిఫికెట్ కూడా గత 15 సంవత్సరం నుంచి మెయింటైన్ చేస్తున్నాము. ఈ సంవత్సరం కూడా నూతనంగా ఐఏఎస్ సర్టిఫికెట్ కూడా రెన్యువల్ చేయడం జరిగినది. ఐ ఎస్ ఐ ఆడిట్ టీం వారు కళాశాలకు విచ్చేసి రెండు రోజులు ఆడిట్ చేసిన తర్వాత ఈ ఐఎస్ఓ సర్టిఫికెట్ మంజూరు చేయడమైనది ఇందులో ప్రధానంగా క్వాలిటీ కి సంబంధించిన సర్టిఫికెట్, దీంతోపాటు కళాశాల లో ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ సంబంధించిన సర్టిఫికెట్ , మరియు ఆకుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్మెంట్ సంబంధించిన సర్టిఫికెట్, ఈ మూడు సర్టిఫికెట్లు కూడా ఇంటర్నేషనల్ అక్రిడేషన్ ఫోరం ద్వారా అదేవిధంగా యునైటెడ్ అక్రిడేషన్ ఫోరం ద్వారా పూర్తిస్థాయిలో అంతర్జాతీయ సంస్థ ద్వారా అక్రిడేషన్ను సాధించిన ఘనత డైట్ కి దక్కింది. ఈ అక్రిడేషన్ సాధించడంలో వైస్ ప్రిన్సిపల్ ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ మరియు విభాగా వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు సహకారంతోఈ ఘనత సాధించామని తెలియజేశారు .ఈ సర్టిఫికెట్లు మూడు సంవత్సరాలు వరకు వర్తింపజేస్తాయని తెలియజేశారు ఈ నూతన సర్టిఫికెట్స్ ద్వారా మరిన్ని మౌలిక సదుపాయాలతో ఉత్తమ విద్య ను విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.

# ఆలయంలో దొంగతనం జరిగితే ఫిర్యాదు చేయకూడదా ?

- ఫిర్యాదు చేస్తే అట్రాసిటీ కేసులు పెట్టి బెదిరిస్తారా
- వెంకన్న స్వామి ఆలయ ధర్మకర్త మంజుల



**గాజువాక, (విశాఖ సమాచారమ్):-** జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీ ( గరుడాద్రి) కొండపై ఉత్తరద్వారా దర్శనంతో కొలువు దీరన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేసినప్పటినుండి ఎన్నో అవంతరాలు, గొడవలు, పోలీస్ ఫిర్యాదులు ఇలా ఒకటే మిటి ఎన్నో రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆలయ ధర్మకర్త, చైర్ పర్సన్ మంత్రి మంజుల ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం పరిరక్షణలో భాగంగా హిందువుల ఆరాధ్య దైవం కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేయడమే తాను చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఈ ఆలయంలో గత నెల 24వ తేదీన స్వామివారి ఉండి దొంగతనం జరిగిందని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ద్వారా తెలిపారు. దీనికి సంబంధించి రోజులాగే ఆలయ అర్చకులు తాతాచార్యులు, గుడి సేవకురాలు 24వ తేదీ ఉదయం ఆలయం తలుపులు తెరిచేందుకు గుడికి వెళ్ళగా అక్కడ మెయిన్ గేటు కు ఉన్న తాళం విరగ్గొట్టి ఉండడం చూసి గుడి లోపలికి వెళ్లి చూడగా అక్కడ ఉండవలసిన ఉండి లేకపోవడంతో గుడి కమిటీ వారికి సమాచారం ఇచ్చారన్నారు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పదంగా ఆ ప్రాంతంలో తిరుగుతుండడంతో అతన్ని పట్టుకుని గట్టిగా నిలదీయగా అతని పేరు అసిరి నాయుడు అని చెప్పి స్వామివారి ఉండి దొంగతనం చేసింది తానేనని చెప్పడంతో వారిని వెంటనే పోలీసువారికి అప్పజెప్పడం జరిగిందన్నారు. దీనిపై మేము ఇచ్చిన ఫిర్యాదు పై పోలీసు వారు స్పందించి ముద్దాయిని విచారించగా అతను స్నేహితులు గల మరో నాలుగు పేర్లు తో పాటు మరో ఇద్దరుతో కలిసి స్వామివారి ఉండి దొంగతనం చేశామని చెప్పడంతో వారిపై పోలీసు వారు కేసు నమోదు చేశారని తెలిపారు. అయితే తాము పోలీస్ వారికి ఫిర్యాదు చేశామని నెపంతో తమపై ఆ ట్రాసిటీ దొంగ కేసు పెట్టి బెదిరించడం ఎంతవరకు సమంజసం అన్నారు. దీనిపై పోలీసు వారు తగిన దర్యాప్తు చేపట్టి తప్పుడు కేసులు పెట్టిన వారిని పై చర్యలు తీసుకోవాలని అలాగే స్వామివారి ఉండి దొంగతనం చేసిన వారిని కూడా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పట్టణం మధ్యలో డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

## దోమల మయమవుతున్న జిల్లా కేంద్రం అనకాపల్లి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ (ప్రతినిధి):-** జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ను గురువారం సిపిఎం పార్టీ బృందం సందర్శించి పరిశీలించారు. పట్టణంలోని సిపిఎం బృధం ఉడ్డుపేట, ఈ విజయరామరాజుపేట బర్మ కాలనీ, లెపర్సీ కోలనీల్లో పర్యటించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వుడ్పేట, వేల్పుల వీధి, నెహ్రూ చౌక్ వంటి ప్రాతంతాల్లో ఈడంపింగ్ యార్డ్ వలన తీవ్రమైన దుర్వాసనతో ప్రజలకి అసౌకర్యంగా అనారోగ్యాలు కు కారణం అవుతుందన్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాట్లాడుతూ కె. లోకనాధం మాట్లాడుతూ ఊరి మీద చెత్తంనంతా తీసుకొచ్చి మున్సిపల్ కార్యాలయంలో వేసుకోవడం దేశంలోనే మన అనకాపల్లి లోనే విచిత్రమైన పద్ధతిలో జరుగు తుందన్నారు. దీన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఆక్షేపిస్తుందన్నారు. దీనివలన అనకాపల్లి పట్నం అంతా దోమలతో నిండిపోయిందని దీనివల్ల డెంగ్యూ , మలేరియా వంటి అంటు వ్యాధులు ప్రబలి ప్రజలకు వేలాది రూపాయలు ఖర్చవుతుంది అన్నారు. పక్కనే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజ్ ఉన్నదని ఆ పిల్లలు కూడా దుర్వాసనతో తీవ్రమైన అనారోగ్య సమస్యలుతో ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. అనకాపల్లి నుంచి రాష్ట్ర స్థాయి నాయకులుగా ఎదిగి నప్పటికీ అతి ముఖ్యమైన ఈ సమస్యను పరిష్కరించకపోవడం అన్యాయం అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఈ డంపింగ్ యార్డ్ ను పట్టణం బయట ప్రదేశానికి తరలించాలని డిమాండ్ చేశారు. లేదంటే తనకు ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూలి రామరాజుపేట రైల్వే ట్రాక్ పక్కన రోడ్డు వెయ్యాలని, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, రైల్వే ట్రాకు పక్క నుంచి గోడ కట్టాలని, లెపర్సీ కాలనీలో మున్సిపల్ తాగుటకు మంచినీరు రావడం లేదని అక్కడ ప్రజలు ఆవేదన చెందారున్నారు. అక్కడ వాడికి కోసం ఒక ట్యాంక్ నిర్మించారని అది కూడా ప్లాస్టిక్ అవడం వల్ల చిన్న స్టాక్ వలన అందరికీ సరిపడి నీరు రాలేదని దాన్ని సిమెంట్తో నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు చెప్పిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పుష్కరణకు వచ్చేస్తామని అవసరమైతే అందరం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి ఉమా మహేశ్వర రావు, అల్లు రాజు, ఎస్. వీర్ యాదవ్, కాళ్ళ తేలయ్యబాబు, పి.చలపతి, బి.నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# భోగ లింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు ప్రారంభం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** స్థానిక కోటవీధిలో వెలసిన శ్రీ సర్వకామదాంబ సమేత భోగ లింగేశ్వర స్వామి దేవాలయ%శీ% లో పౌర్ణమి పాల్గుణ మాసం శుభసమయమున స్వామి వారి వార్షిక కళ్యాణ మహొత్సవం ప్రారంభం జరిగిందని దేవస్థానం చైర్మన్ కాంద్రేగుల సత్యనారాయణ తెలిపారు. ముందుగా దేవస్థానంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం మరియు నందీశ్వర ధ్వజోహరుణ వేద పండితుల పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. తదుపరి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగింపు కార్యక్రమం కొబ్బరికాయ కొట్టి చైర్మన్ ప్రారంభించారు. స్వామివారి పల్లకి ఊరేగింపు అగ్గిమర్రి చెట్టు వీధి, దిబ్బవీధి గంగిరేమిచెట్టు వీధి పెద్దరామస్వామి కోవెల వీధి చిన్న రామస్వామి కోవెల వీధి విల్లూరి జోగి నాయుడు గారి వీధి పల్లపు వీధి సంతోషిమాత వీధి మీదగా స్వామివారి ఊరేగింపు జరిగి దేవస్థానముకు చేరుకుంది . సాయంత్రం 6 గంటలకు వేద పండితులు ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఐదు రోజులపాటు స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తారని 15వ తేదీన పుష్పాంజలి కార్యక్రమంతో ముగింపు జరుగుతుందని చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో. ఆలయ డైరెక్టర్లు మద్దాల నారాయణరావు పెంటకోట గణేష్ కుమార్ మల్ల సూరిబాబు రాపేటి సంతోష్ కుమార్ భారీచాకలి నాగేశ్వరరావు దూలం సత్యవతి ఈవో బి మురళీకృష్ణ అర్చకులు పేరూరి నారాయణ స్వాత్విక్ శర్మ వేణుగోపాల్ బుజ్జి దేవస్థానం సిబ్బంది మల్ల గణేష్ మాజీ చైర్మన్ కొణతాల కారు బాబు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యల్లపు చంద్రమోహన్ వేగి గౌరేసు కాంద్రేగుల పోతురాజు కాంద్రేగుల వెంకట సూరిబాబు శిలపరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

**పాడేరు, (విశాఖ సమాచారమ్):-** ఏజెన్సీలో ప్రస్తుత వేసవిలో తాగునిటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇంచార్జ పి ఒ జాయింట్ కలెక్టర్ డా ఎం జె అభిషేక్ గౌడ ఆదేశంచారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం పాడేరు డివిజన్ 11 మండలాల ఆర్ డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు తో పిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మరమ్మతులకు గురైన చేతి పంపులకు మరమ్మతులను చేయించాలన్నారు. తాగు నీటి పథకాలకు మరమ్మతు చేపట్టి తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలన్నారు. జల జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికి తాగునీటిని అందించేంచదకు కుళాయిలు ఏర్పాటు చేయాలి అన్నారు. ఎంపీడీవోలు, ఆర్ డబ్ల్యూఎస్ మరియు గ్రామా పంచాయతి సిబ్బంది సమన్వయం తో పనిచేయాలిని ఆదేశించారు. తాగునీటి పరిష్కారానికి ప్రతి 15 రోజులు ఒక్కసరి సంబంధిత సిబ్బంది తో సమావేశం నిర్వహిచాలని అన్నారు. వేసవి కాలం లో తాగునీటి సమస్యలు పై ఫిర్యాదులు రాకూడదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరాకు గ్రామాలలో గ్రామా తాగునీరు పారిశుధ్య కామిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు.ఈ సమావేశం లో గ్రామిన నిటి సరఫరా విభగం డి ఇ కె. జవహర్ కుమార్, డి పి ఒ బి.లవరాజు, గ్రామా వార్డ్ సచావాలయ నోడల్ ఆఫీసర్ పి.ఎస్.కుమార్, పాడేరు డివిజన్ 11 మండలాల ఆర్ డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంతదూరమైనా ఇదే వాహనం!



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ద్విచక్ర వాహనానికి ఈ రూపం ఏమిటి? దానిపై నలుగురు ప్రయాణించడం ఏమిటి? అని ప్రతి ఒక్కరూ ఆసక్తిగా చూస్తున్న ఈ కుటుంబానిది తెలంగాణ రాష్ట్రం భద్రాచలం. వాహనం నడుపుతున్న వ్యక్తి పేరు ఎం.వీర్రాజు. మూడో ఏటే పోలియో ప్రభావంతో ఇంటికే పరిమితం అయ్యారు. తరువాత తలెత్తిన కొన్ని అనారోగ్య సమస్యలకు విశాఖపట్నంలోని ప్రభుత్వ 'రాణిచంద్రమణిదేవి (ఆర్‌సీడీ) ఆసుపత్రిలో చికిత్స తీసుకోగా పరిస్థితి కుదుటపడింది. తరువాత చిన్నచిన్న బంగారం పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ప్రస్తుతం కుమారుడు అభిషేక్‌రాజుకు ఎముకలకు సంబంధించిన సమస్య తలెత్తడంతో అతడిని కూడా వైద్య నిమిత్తం విశాఖ ఆర్‌సీడీకే తీసుకొస్తున్నారు. బస్సులపై ప్రయాణించే పరిస్థితి లేకపోవడంతో ఐదేళ్ల కిందట గుజరాత్‌లో తన ద్విచక్ర వాహనాన్ని తనతో పాటు కుటుంబ సభ్యులు ప్రయాణించేందుకు అనువుగా తయారు చేయించుకున్నారు. ఇందుకు దాదాపు రూ. 1,50,000లు ఖర్చుపెట్టారు. భద్రాచలం నుంచి విశాఖకు రానుపోను సుమారు 800 కి.మీ. ఉంటుంది. వివిధ అవసరాల నిమిత్తం ఇదే వాహనంపై హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు కుటుంబ సభ్యులు వెళుతుంటారు. 'తెలంగాణ ప్రభుత్వం పింఛను అందిస్తోంది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తే చిన్నపాటి వ్యాపారం చేసుకొని జీవిస్తాం' అని విశాఖ వచ్చిన వీర్రాజు కుటుంబీకులు పేర్కొన్నారు.

# సారాకు వ్యతిరేకంగా కళా ప్రదర్శనలు

కశింకోట, (విశాఖ సమాచారమ్):- నవోదయం- 2.0 కార్యక్రమంలో భాగంగా కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి గ్రామస్తులకు కళా జాతర ద్వారా నాటుసారాకు వ్యతిరేకంగా అవగాహన కలిగించడమైనదని విశాఖపట్నం జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ & ఎక్సైజ్ డి.శ్రీరామ చంద్ర మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసిన, అమ్మిన, రవాణా చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రోహిబిషన్ చట్టం-1995 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. నాటుసారా సంబంధిత ఫిర్యాదుల కొరకు 14405 టోల్ ఫ్రీ నెంబర్ కి తెలియజేయాలని, ఆంధ్రప్రదేశ్ ను నాటుసారా రహితంగా తయారు చేసేందుకు ప్రారంభించిన నవోదయ 0- 2.0 కార్యక్రమానికి అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ప్రోహిబిషణ్ మరియు ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, అనకాపల్లి స్టేషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వై. లక్ష్మున్నాయుడు, కశింకోట పోలీసు ఎస్ ఐ మనోజ్ , ఎక్సైజ్ ఎస్ ఐ గణేష్, గ్రామ సర్పంచ్ గున్నయ్య నాయుడు, గ్రామ పెద్దలు సోమేశ్వరరావు, శ్రీనివాసరావు, రమణ, గోవింద రావు గారు మహిళా పోలీస్, , ఇతర పెద్దలు పాల్గొన్నారు.

# సారా అనర్థాలపై అవగాహన



బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చోడవరం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, కె.వి పాపు నాయుడు ఆదేశాలు తో బుచ్చయ్యపేట మండలం నీలకంఠాపురం, రాజాం, మల్లం, అప్పంపాలెం, చిన భీమవరం, తురకలపూడి, పంగిడి, గొర్లిపాలెం, పెద్దమదీనా, బుచ్చయ్యపేట, వి.ఆర్ ఆర్ పేట, వడ్దాది పరిసర గ్రామాలలో ప్రజలలో చైతన్య నిమిత్తం సారాయి త్రాగడం వలన వచ్చే ఆరోగ్య సమస్యలు, దుష్పరిణామాలు సారా నిర్మూలన కొరకు ప్రజలులో అవగాహన కోసం ప్రచార రథము తో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆన్‌లైన్లో కవితా సమ్మేళనం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- హెూలీ పండగ సందర్భంగా గురువారం ఆన్‌లైన్లో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ న్యూస్ ఎడిటర్ కె.వి శర్మ (విశాఖపట్నం) హాజరయ్యారు. మొత్తం 31 మంది కవులు తమ కవితలను ప్రదర్శించారు. వాట్సాప్ గ్రూప్ 556 మందితో నిండిపోయింది. డిజిటల్ సర్టిఫికెట్లను చైర్మన్ పంపిణీ చేశారు.

## జాతరలో మహిళా ఎస్సైని జుట్టు పట్టుకొని కొట్టిన పోకిరీలు

### విజయనగరం జిల్లా గుడివాడలో ఘటన
### 9 మంది నిందితుల అరెస్ట్ పరారీలో మరొకరు



విజయనగరం, (విశాఖ సమాచారమ్):- ఓ జాతరలో అసభ్య నృత్యాలను అడ్డుకున్న మహిళా ఎస్సైపై కొందరు యువకులు దాడిచేసి, ఆమె జుట్టు పట్టుకొని కొట్టి, అసభ్య పదజాలంతో దూషించారు విజయనగరం జిల్లా వేపాడ మండలం గుడివాడ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిందీ ఘటన. పోలీసుల కథనం ప్రకారం వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా మంగళవారం రాత్రి గ్రామంలో 'డ్యాన్స్ బేబీ డ్యాన్స్' కార్యక్రమం నిర్వహించారు మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు హంగామా చేస్తూ డ్యాన్స్ చేస్తున్న యువతులతో అసభ్యకరంగా ప్రవర్తించారు. అక్కడే విధుల్లో ఉన్న వల్లంపూడి ఎస్సై బి.దేవి వారిని వారించే ప్రయత్నం చేశారు దీంతో మరింత రెచ్చిపోయిన యువకులు ఎస్సైపై దాడిచేశారు. ఆమె జుట్టు పట్టుకుని కొట్టారు దీంతో ఆమె వారి నుంచి తప్పించుకుని ప్రాణభయంతో పరుగులు తీశారు. సమీపంలోని ఓ ఇంట్లోకి వెళ్లి తలదాచు కున్నారు అయినా వదలని నిందితులు అక్కడికి కూడా వెళ్లి నానా రభస చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని నిందితులను అదుపు లోకి తీసుకున్నారు. ఎస్సైకి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మొత్తం 9 మంది నిందితులను అరెస్ట్ చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

**హెూం మంత్రి ఆగ్రహం**

విజయనగరం జిల్లాలో మహిళా ఎస్సై పట్ల ఆకతాయిల దాడి ఘటనపై హెూంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో హద్దులు మీరి ప్రవర్తించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయనగరం జిల్లా ఎస్పీతో వకుల్ జిందాల్‌తో హెూంమంత్రి ఫోన్ లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడి. జాతర పేరుతో మహిళలపట్ల పోకిరీ వేషాలు వేస్తే సహించబోమని హెచ్చరించిన హెూంమంత్రి అనిత.

# రేపు మైనారిటీ వర్గాలకు జాబ్ మేళా

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, సొసైటీ ఫర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజ్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ( సీడాప్), స్కిల్ డెవలప్మెంట్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వారి ద్వారా ఈనెల 14న శుక్రవారం జరగవలసిన జాబ్ మేళా ను ఈనెల 15 శనివారానికి మార్పు చేశారు. విశాఖ జిల్లాలో ని మైనారిటీ వర్గాలు (ముస్లిం, క్రైస్తవ, సిక్కు , బౌద్ధ, జైన మొదలగు ) చెందిన యువత కూడా ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగావకాశములను పొందగలరని కార్యనిర్వాహక సంచాలకులు, ఏపీ మైనారిటీ కార్పొరేషన్, విశాఖపట్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ - ఓల్డ్ ఐ.టి.ఐ జంక్షన్, కంచరపాలెం, విశాఖపట్నంలో ఉ.9.00 నుండి సా.6.00 వరకు జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన వారు https://naipunyam.ap.gov.in వెబ్ సైటులో రిజిస్ట్రేషన్ చేసుకొని రెస్యూమ్ తో పాటు, అవసరం సర్టిఫికెట్ లతో హాజరు కావాలని సూచించారు.

ఇతర వివరములకు జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, డా. ధీన్ షాధిఖానా, ఓల్డ్ పోస్ట్ ఆఫీసు, విశాఖపట్నం వారిని స్వయముగా లేదా9849901159, 8555868681, 0891-2502271 ఫోన్ నంబర్ల లో సంప్రదించవచ్చును.

# పెదముసిడివాడలో కొనసాగుతున్న ఆక్రమణలు



పరవాడ, (విశాఖ సమాచారమ్):- పరవాడ మండలం పెద ముషిడివాడలో ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. వినాయకుడు గుడు పక్కన (మణికంఠ టీ స్టాల్ ఎదురుగా) సర్వేనెంబర్ 379 భూస్మాన్ గెడ్డ ను పూడ్చేందుకు కూటమి నాయకుడొకరు సిద్ధమ య్యారు. ఈ క్రమంలో గ్రామంలో అన్ని పార్టీలు సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశం లో పంచాయతీలో జరిగే భూకబ్జాలపై ఒకరిపై ఒకరు పిర్యాదు చేసుకోకుండా తీర్మాణం చేసుకున్నారట. ఎన్నికల ముందు ఓ వైసీపీ నాయకుడు భారీ స్థాయిలో భూకబ్జాలకు పాల్పడ్డాడని ఆరోపణలు గుప్పించిన సదరు కూటమి నాయకుడే తీరా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అదే వైసీపీ నాయకుడితో దోస్త్ మేరా దోస్త్ అంటూ చేతులు కలిపి భూ కబ్జాలకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా బుధవారం సర్వే నంబర్ 379లో రెండు ట్రాక్టర్ల తో వేస్ట్ మెటీరియల్ ని తీసుకొచ్చి గెడ్డలో వేశారు. అదే రోజు రాత్రికి గ్రావెల్ తో పూడ్చేందుకు స్థానిక గ్రావెల్ మాఫియాతో ఒప్పందం కూడా కుదిరింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నీతులు, అధికారంలో ఉన్నప్పుడు అక్రమాలే ఈ నాయకుడి ప్రధాన ఆశయమని తన అనుచరులే చెబుతుండడం కొసమెరుపు. అయితే ఈ గెడ్డ వాగును సంవత్సరం క్రితం ఆక్రమించేందుకు ఆ కూటమి నాయకుడు ప్రయత్నించినప్పటికీ అప్పట్లో కొన్ని పత్రికలో వార్తలు వచ్చాయి. దీంతో అప్పటి రెవిన్యూ అధికారులు గెడ్డ కబ్జాను అడ్డుకున్నారు. ప్రస్తుతం తిరిగి ఇపుడు గెడ్డను కబ్జా చేసేందుకు బరితెగించారు. కాగా ఈ గెడ్డ కబ్జాపై పదిరోజులుగా ఇటు రెవెన్యూ అధికారులకు, అటు ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ పలు ఫిర్యాదులు కూడా ఉన్నాయి. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు అసలు స్పందించక పోవడంతో కబ్జాదారుల ఆగడాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. ముఖ్యంగా స్థానిక వీఆర్వో పూర్తిగా అవినీతిమయంలో మునిగి తేలుతుండటంతో ఇక్కడ కబ్జాదారులకు కూడా రాజమార్గం ఏర్పడిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా తహసిల్దార్ స్పందించి గెడ్డ వాగు కబ్జాను అడ్డుకోవాలని, సదరు కూటమి నాయకుడి పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# జాతీయ మత్స్యకారుల సమావేశానికి ఫిష్ కాన్ రాష్ట్ర ప్రతినిధులు



అర్జిల్లి దాసు



సూరాడ రాజారావు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫిషెర్మెన్ ఆర్గనైజేషన్స్ (ఫిఫో) ఆధ్వర్యములో ఈ నెల 18,19 తేదీలలో కన్యాకుమారిలో జరగ నున్న జాతీయ మత్స్యకారుల సమావేశానికి ఫిష్ కాన్ రాష్ట్ర అధ్యక్షులు సూరాడ రాజారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జిల్లి దాసు హాజరవుతున్నారు ఈ మేరకు ఫిష్ కాన్ నుండి ఇద్దరు ప్రతినిధులు హాజరు కావాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫిషర్మెన్ ఆర్గనైజేషన్స్ ప్రతినిధి విన్సెంట్ జైన్ నుండి ఆహ్వానం అందింది. దేశములో నున్న 9 కోస్తా రాష్ట్రాలు 4 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మత్స్యకార సంఘాల ప్రతనిధులతో కొత్తగా ఏర్పాటు అయ్యిందని అర్జిల్లి దాసు చెప్పారు


ఈ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫిషెర్మెన్ ఆర్గనైజేషన్స్ లో ఫిష్ కాన్ ఆంధ్ర ప్రదేశ్ కూడా సభ్యత్వం పొందిందని చెప్పారు.

ఈ మేరకు ఈ నెల 18,19లో కన్యా కుమారిలో జాతీయ మత్స్యకారుల ప్రతినిధులతో ఫిఫో ఆధ్వర్యములో జాతీయ సమావేశం జరుగుతుందని చెప్పారు.

18న ఫిఫో కార్యాలయం ప్రారంభం, 19న ఫిఫా నూతన జాతీయ కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని అనంతరం నూతన కమిటీతో జాతీయ స్థాయి సమావేశం జరుగుతుందని అర్జిల్లి దాసు చెప్పారు

ఈ సమావేశములో మత్స్యకారుల హక్కులు, చట్టాలు, ఆంధ్ర ప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల తీరం, సముద్రం హక్కుల రక్షణ చట్టం ప్రతిపాదనకు సంబంధించి చర్చించడం జరుగుతుందని చెప్పారు.

# వుడా భూముల సమస్య పరిష్కరించాలి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- జీవీఎంసీ పరిధిలో ఉన్న వుడా భూములు గత 17 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉండడం వలన అనకాపల్లి రైతులు ఇబ్బందికి గురవుతున్నారని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. అసెంబ్లీలో ఈ సమస్యను మున్సిపల్ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గత 5 సంవత్సరాల నుండి అమరావతి రైతులు ఏవిధంగా ఇబ్బందులకు గురి అయ్యారో అదే విధంగా అనకాపల్లి రైతులు ఈ భూముల విషయంలో ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే వాటికి పరిష్కార మార్గం చూడవలసిందిగా మున్సిపల్ మంత్రిని కొణతాల కోరారు.

పాలిటెక్నిక్ ఉద్యోగుల జీతాలు చెల్లించాలి.

ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలు గ్రీన్ హైడ్రోజన్ కేంద్రాలుగా మారనున్నాయి. ఈమధ్యే పూడిమడక గ్రామంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు శంకుస్థాపన జరిగింది. గతంలో విద్యుత్ శాఖలో చాలా అవకతవకలు జరిగాయి. దాదాపు 12000 కోట్లు అదనపు భారం ప్రభుత్వం ప్రజలు మీద పడకుండా భరిస్తుంది. గత ప్రభుత్వం చేసుకున్న ఎస్సీ సీఐ ఒప్పందాల వల్ల ఎలక్ట్రిసిటీ బోర్డుకి 65000 కోట్ల అదనపు భారం పడే అవకాశం వుంది. అలాగే అనకాపల్లి లో ఉన్న ఆర్ఇసిఎస్ ను ఏపీఈ డీసీఎల్ బోర్డులో విలీనం చేయడం వలన, ఆ బోర్డు లాభాలు తీసుకుంటున్నాయి గానీ అక్కడ ఉద్యోగులను పట్టించుకోవడం లేదు. వారి జీతాలు కూడా పెంచడం లేదు. ఆర్ఇసిఎస్ అనుసంధానంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగులకు కూడా 4 నెలల నుండి జీతాలు చెల్లించడం లేదు. వీటిమీద తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా విద్యుత్ శాఖ మంత్రి కి. కొణతాల విజ్ఞప్తి చేశారు.

# మడ అడవులను అభివృద్ధి చేయాలి

## జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



అనకాపల్లి/రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):- సముద్రతీర ప్రాంతాలలో మడ అడవుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. రాంబిల్లి మండలం, లాలంకోడూరు గ్రామ పంచాయతీ, సీతపాలెం తీర ప్రాంతంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి పథకం మరియు వాస్కా ప్రాజెక్టు ఆధ్వర్యములో ఏర్పాటుచేసిన మడ అడవుల అభివృద్ధి పథకం కార్యక్రమంలో జిల్లా కలెక్టరు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మడ అడవులు చాలా కీలకమని తెలిపారు. వాటిని కాపాడు కోవాలని, లేని చోట్ల అభివృద్ధి చేయాలని తెలిపారు. పర్యావరణ సమతుల్యం కాపాడుటలోను, ప్రకృతి విపత్తుల సమయంలో నష్ట తీవ్రత తగ్గించుటలో మడ అడవులు కీలకమని తెలిపారు. మడ అడవుల పెంపకం వలన నేల కోతను తగ్గించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం మరియు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించడంతో పాటు గ్రామీణ జనాభాకు ఉపాధి కలుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో మడ అడవులు అభివృద్ధికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లక్షాడబ్బది వేల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జి.ఐ.జెడ్. జర్మనీ ఫౌండేషను మరియు భారత ప్రభుత్వం వారి సహకారంతో నిర్వహించబడుతుందని, ఈ మడ అడవులు పెంపకమునకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎం.ఎస్. స్వామినాథన్ ఫౌండేషన్, చెన్నై వారు సమకూర్చడం జరుగుతుందన్నారు. నాటిన మొక్కలను ప్రజలు జాగ్రత్తగా సంరక్షించాలని తెలిపారు. తీరప్రాంతం వెంబడి గ్రీన్ వాల్ను రూపొందించడానికి మడ అడవులు పెంపకం ఎంతో సహాయపడటం తో పాటు తుఫానులు మరియు సునామీ వంటి విపత్తుల నుండి రక్షణ కల్పిస్తాయని ఆమె తెలిపారు. అడిషనల్ కమీషనర్ ఎం. శివ ప్రసాద్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి పథకం మరియు వాస్కా ప్రాజెక్టు నిర్వహణ లో భాగం గా లాలం కోడూరు గ్రామము లో 24 ఎకరాలను ఎంపిక చేశామని, అందులో 4 ఎకరాలను భూమిని మోడల్ గా అభివృద్ధి చేయుటం జరుగుతుందని అలాగే ఆంధ్ర ప్రదేశ్ లో సముద్ర ప్రాంతాల సమీపం లో ఉన్న అనువైన ప్రదేశములను గుర్తించి, అక్కడ మడ అడవుల పెంపకం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పథక సంచాలకులు పూర్ణిమ దేవి, ఎం.ఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సైంటిస్ట్ డాక్టర్ నాగరాజన్, వాస్కా ప్రాజెక్టు స్టేట్ కోఆర్డినేటర్ వనపర్ల సంతోష్ కుమార్, ఎంపీడీఓ విజయ మాధురి, గ్రామ సర్పంచ్ గుణా, ప్లాంటేషన్ మేనేజర్ సురేష్, వాస్కా జిల్లా సిబ్బంది దండే ప్రసాద్ ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సభ



రావికమతం, (విశాఖ సమాచారమ్):- మండల కేంద్రం జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఒకరి కొకరు ఆత్మీయంగా చివరిసారిగా ఆనందంగా గడిపారు. 6వ తరగతనుంచి ఒకే పాఠశాలలో, ఒకే తరగతి గదిలో చదువుకొని, ఒక్కసారిగా 10వ తరగతి పూర్తి అయిన వెంటనే ఎక్కడెక్కడో, వేరువేరు పాఠశాలలో ఒకరికొకరు విడిపోయే పరిస్థితి నెలకొంటుంది. అటువంటి పరిస్థితుల్లో చివరగా చివరిసారిగా ఈ ఆత్మీయ సభను ఏర్పాటు చేసుకొని తోటి విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి ఆనందంగా గడిపారు. మరి కొంతమంది విద్యార్థులు ఒక్కసారిగా విడిపోతున్నందుకుగా వారి మనసులో ఉన్న ఆవేదనను మనసులో ఉన్న బాధను బయటకు చెప్పుకోలేనటువంటి పరిస్థితుల్లో ఒకరికొకరు కన్నీటి పర్యంతమయ్యి ఒకరికొకరు ఆప్యాయంగా గడిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు బంటు సత్యారావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అఫ్రిది నన్ను మతం మారమన్నాడు

## నా కెరీర్ నాశనమైంది: డానిష్ కనేరియా



ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పాక్‌లో వివక్షను ఎదుర్కొన్నట్లు పేర్కొన్న అతడు.. తన కెరీర్ నాశనం కావడానికి అదే ప్రధాన కారణమని వ్యాఖ్యానించాడు. పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిదిపై తీవ్ర విమర్శలనూ గుప్పించాడు. వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో డానిష్ మాట్లాడాడు.

"మనమంతా ఇక్కడ కలుసుకున్నందుకు ఆనందంగా ఉంది. పాకిస్థాన్‌లో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకోవడం బాగుంది. అక్కడ చాలా వివక్షను ఎదుర్కొన్నాం. ఇప్పుడు మన గళం విప్పుతున్నాం. నేను కూడా పాక్‌లో చాలాసార్లు వివక్షను అనుభవించా. నా కెరీర్ నాశనం అయింది. నాకు తగినట్లుగా గౌరవం పొందలేకపోయా. కారణం పాక్‌లో మైనారిటీలం కావడమే. ఇప్పుడు నేను అమెరికాలో ఉన్నా. మనం పాక్‌లో అనుభవించిన కష్టాలు ఎలాంటివో అమెరికాకు తెలియాలి. అప్పుడే ఏదొక చర్యలు తీసుకోనేందుకు ఆస్కారముంటుంది" అని కనేరియా వెల్లడించాడు.

**ఇంజామామ్ సపోర్ట్..**

పాకిస్థాన్ తరఫున 61 టెస్టులు ఆడిన కనేరియా ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే, షాహిద్ అఫ్రిది సారథిగా ఉన్నప్పుడు తనను మతం మారమని తరచూ ఒత్తిడి చేసేవాడని కనేరియా తెలిపాడు. " పాక్ కోసం నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించా. నాకు మద్దతుగా నిలిచిన ఏకైక కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ మాత్రమే. షోయబ్ అక్తర్, షాహిద్ అఫ్రిది సహా ఇతర ప్లేయర్లలో కొందరు తీవ్రంగా ఇబ్బంది పెట్టేవారు. కనీసం నాతో కలిసి తినేవాళ్లూ కాదు. షాహిద్ అఫ్రిది అందరికంటే ఎక్కువగా నన్ను మతం మారమని ఒత్తిడి చేసేవాడు. చాలాసార్లు అడుగుతూనే ఉండేవాడు. ఇంజమామ్ మాత్రం అలాంటి టాపిక్ కూడా తీసుకొచ్చేవాడు కాదు" అని కనేరియా వ్యాఖ్యానించాడు.

# రోహిత్ టార్గెట్ అదేనా?

## అప్పటివరకు 'నో రిటైర్‌మెంట్'



ఇంటర్నెట్ డెస్క్: టీ20 ప్రపంచ కప్ గెలిచాడు. ఛాంపియన్స్ ట్రోఫీని అందించాడు. ఇప్పటికే పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పేశాడు. ఇప్పుడు వన్డేలకూ గుడ్‌బై చెబుతాడని అంతా భావించారు. కానీ, రిటైర్‌మెంట్ తీసుకోవడం లేదంటూ స్పష్టంచేసేశాడు. ఆ ఆటగాడు ఎవరనేది ఇప్పటికే అర్థమైపోయిందిగా. అతడే.. భారత కెప్టెన్ రోహిత్ శర్మ . ఈ క్రమంలో వన్డే ప్రపంచకప్ 2027 వరకూ ఉంటాడని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ (2025-27) ఫైనల్‌లోనూ ఆడాలనేది అతడి అభిమతంగా ఉందనేది వారి అంచనా.

"రోహిత్ అనుకున్నవిధంగా భావిస్తే మాత్రం అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ మరో రెండేళ్లపాటు కొనసాగే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికా-జింబాబ్వే-నమీబియా ఆతిథ్యంలో వన్డే ప్రపంచ కప్ 2027 టోర్నీ జరగనుంది. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా అదే ఏడాది ఉంది. ఈ రెండింటిని గెలిచి ఘనంగా కెరీర్‌కు వీడ్కోలు పలకాలనేది రోహిత్ భావన" అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

**ఐపీఎల్ తర్వాతే ఓ నిర్ణయం..**

రోహిత్ శర్మ మరో నెల రోజుల్లో 38వ సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నాడు. 2027 నాటికి అతడికి 40 ఏళ్లు వస్తాయి. అప్పటివరకు కొనసాగాలంటే ఫిట్‌నెస్‌తోపాటు బ్యాటింగ్‌లో ఫామ్ అత్యంత కీలకం. టీమ్ఇండియా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌తో కలిసి రోహిత్ పనిచేయనున్నట్లు తెలుస్తోంది. రాబోయే రెండేళ్లలో భారత్ 27 వన్డేలు ఆడే అవకాశం ఉంది. దినేశ్ కార్తిక్ నుంచి కేఎల్ రాహుల్ వరకు నాయర్ కోచింగ్‌పై మంచి గురి ఉంది. రోహిత్‌తో కలిసి ఆడిన అనుభవం ఉంది. అయితే, టెస్టు భవిష్యత్తుపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. గత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో రోహిత్ ప్రదర్శన గొప్పగా ఏమీ లేదు. దీంతో ఐపీఎల్ ముగిసిన తర్వాత టెస్టు కెరీర్‌పై రోహిత్ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఇంగ్లాండ్‌తో జూన్‌లో టెస్టు సిరీస్ జరగనుంది. అప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ మొదలవుతుంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకోవాలంటే భారత్‌కు ఈ సిరీస్ అత్యంత కీలకం.

# స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో ప్రతి ఉద్యోగి పాల్గొనాలి

## ప్రజలు భాగస్వామ్యులు కావాలి - జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధం - కలెక్టరు విజయ కృష్ణన్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- జిల్లాలో గల ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ కృషన్ ఆదేశించారు. స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్చి 15వ తేది మూడవ శనివారం నిర్వహించే శుభ్రత కార్యక్రమాలపై గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో జిల్లా, డివిజను, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఈ కార్యక్రమం ద్వారా పట్టణాలు, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పార్కులు తదతర ప్రదేశాలలో పరిసరాల పరిశుభ్రత చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ప్రతి శాఖకు చెందిన కార్యాలయాలలోను ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రతి ఉద్యోగి పాల్గొనాలని ఆదేశించారు. గ్రామాలలో సచివాలయ సిబ్బంది గ్రామం మరియు బహిరంగ ప్రదేశాలలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని, అందులో ప్రజలను, విద్యార్థులలను భాగస్వాములు చేసుకోవాలని తెలిపారు. ప్రతి శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించాలని, మూడవ శనివారం ప్రభుత్వం నిర్దేశించిన థీంతో కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేదించడం జరిగిందని, దాని అమ్మకాలు, కొనుగోలుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వ్యాపారులు వారి షాపులలో డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలని, సింగిల్ యూజ్ కవర్లు వాడకుండా చూడాలని, వాడిన వారిపై చర్యలు తీసుకొవాలని తెలిపారు. వినియోగదారులు ప్రతి ఒక్కరు రీయూజ్ కవర్లు లేదా సంచులు వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలన్నారు. జిల్లా,డివిజను,మండల గ్రామస్థాయిలలో గల అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు, పాఠశాలలు,వసతి గృహాలు, మైనింగు ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలు, జిల్లాలో గల 880 కర్మాగారాలు, ఫ్యాక్టరీలు మరియు జాతీయ, రాష్ట్ర, పంచాయతీరాజ్ పరిధిలో గల రోడ్లు, అంగన్వాడి సెంటర్లు, గ్రామ వార్డు సచివాలయాలలో స్వచ్ఛత కార్యక్రమాలు అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేపట్టాలని తెలిపారు. పబ్లిక్ టాయిలెట్స్ ను శుభ్రంగా ఉంచాలని, వాటికి అవసరమైన మరమ్మత్తులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా బహిరంగ ప్రదేశాలలో మొక్కలు నాటాలని, నీటయాజమాన్య సంస్థ, సామాజిక వన విభాగాలు ఈ భాద్యత చేపట్టాలని తెలిపారు. మునిసిపాలిటీల పరిధిలో కనీసం 30సెంట్లలో మొక్కలు నాటాలని తెలిపారు. విద్యా సంస్థలన్నింటిలో ఈ కార్యక్రమం చేపట్టాలని, పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులు మినహా మిగిలిన విద్యార్థులను భాగస్వాములను చేయాలని తెలిపారు. అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టాలని తెలిపారు. ఆర్.టి.సి. బస్టాండ్, రైల్వే స్టేషనులలో ప్రజలకు పరిశుభ్రమైన మంచినీరు ఏర్పాటుచేయాలని, పరిసరాలను, మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సుందరీకరణలో భాగంగా వంతెనలు, భవనాలపై సృజనాత్మక పెయింటిగులు వేయించాలని తెలిపారు. గ్రామాలు, పట్టణాలలో కాలువలలో పూడిక తీయించాలని, మురుగునీరు నేరుగా చెరువులు, సాగునీటి కాలువలు, మంచినీటి వనరులలో కలువకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మురుగునీటి కొరకు ప్రత్యేక కుంటలు ఏర్పాటుచేసి, శుద్ధి అయిన నీటి మాత్రమే వదలాలని తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమాల ద్వారా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటాయని, దోమలు, అంటురోగాలు నియంత్రణలో ఉంటాయని, తద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలియజేసారు. ఈ కార్యక్రమం ద్వారా మంచి పనితీరు కనబరచిన స్వచ్ఛవార్డు, స్వచ్ఛ పాఠశాల, స్వచ్ఛ అపార్టుమెంటు, స్వచ్ఛ కళాశాల, స్వచ్ఛ బస్టాండు, రైల్వే స్టేషనులను గుర్తించి అవార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యకమానికి సంబంధించి ప్రతి జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకొని పర్యవేక్షణ చేయాలని, కార్యక్రమానికి సంబంధించి ప్రతి శాఖ ప్రణాళిక రూపొందించుకొని సమర్పించాలన్నారు. కార్యక్రమం అనంతరం ఎస్ఎఎస్ఎ యాప్ నందు వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, జిల్లా గణాంకాధికారి (సి.పి.ఓ.) జి.రామారావు, జిల్లా గ్రామీణాభివృది సంస్థ ప్రోజెక్టు డెరెక్టరు కె. శచీదేవి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటరు జిల్లా కోఆర్డినేటరు ఇ. నాగలక్ష్మి,జిల్లా ప్రజా రవాణా అధికారి కె. పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషా రాణీ, డుమా ప్రోజెక్టు అధికారి బి.పూర్ణమాదేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 38 గంటలు కదలకుండా నిలబడి యూట్యూబర్ వరల్డ్ రికార్డు

## సోషల్ మీడియాలో వైరల్ గా మారిన వీడియో



ప్రస్తుతం ఇంటర్నెట్ రాజ్యమేలుతుంది అనడంలో ఎతువంటి అతిశయోక్తి లేదు. అప్పుడప్పుడు ఇంటర్నెట్‌లో రకరకాల ఛాలెంజ్‌లు వైరల్ అవుతుంటాయి. కొందరు ఫన్నీ ఛాలెంజ్‌లు చేస్తుంటే.. మరికొందరు తమ ఓపిక, పట్టుదలను పరీక్షించే అసాధారణమైన సాహసాలను చేస్తుంటారు. ఈ నేపథ్యంలో యూట్యూబర్ 'నార్మే' ఏకంగా 38 గంటలు కదలకుండా నిలబడి ప్రపంచ రికార్డు సృష్టించాడు. నార్మే చేసిన ఈ సాహసం ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. 38 గంటల పాటు ఆయన ఒక్క అంగుళం కూడా కదలకుండా నిలబడి సరికొత్త రికార్డ్ నెలకొల్పాడు. ఇది సాధారణమైన పని కాదు. అంతసేపు శరీరాన్ని స్థిరంగా ఉంచడం చాలా కష్టం. అయినప్పటికీ, తన అద్భుతమైన సెల్ఫ్ కంట్రోల్‌తో నార్మే ఈ రికార్డును సాధించాడు. ఈ రికార్డు సాధించే క్రమంలో అతను ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నాడు. అతన్ని డిస్టర్బ్ చేయడానికి కొంతమంది ఫాలోవర్లు సోషల్ మీడియాలో ట్యాగ్ చేస్తూ మెసేజ్‌లు పంపించారు. ఇంకొందరు కావాలని ప్రాంక్స్ చేసి అతన్ని కదిలించడానికి ప్రయత్నించారు. కొంతమంది అతని స్థితిని గమనించి పోలీసులకు ఫోన్ చేసి అలర్ట్ చేశారు. అయినప్పటికీ, అతను అస్సలు డిస్టర్బ్ కాలేదు. చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోకుండా ఒక విగ్రహంలా నిలబడి రికార్డును సృష్టించాడు. నార్మే చేసిన ఈ సాహసం కేవలం ఒక రికార్డే కాదు.. ఓపిక, పట్టుదల, మానసిక స్థైర్యానికి నిదర్శనంగా నిలిచాడు. ప్రస్తుత ఉరుకు పరుగు ప్రపంచంలో ఏమీ చేయకపోవడమే ఒక్కోసారి పెద్ద ఛాలెంజ్. ఇది కేవలం శరీరానికే కాకుండా, మనసుకు కూడా పరీక్ష. అంతసేపు కదలకుండా నిలబడి ఉండటం కోసం బాడీని, మైండ్‌ను ప్రత్యేకంగా ట్రైన్ చేసుకోవాలి. డిస్ట్రాక్షన్స్‌ను పట్టించుకోకుండా ఉండేలా ఎంతో డిసిప్లిన్ అవసరం.

నార్మే చేసిన ఈ సాహసం వైరల్ అవడంతో ఆన్‌లైన్‌లో ఎంతో మంది అతని లైవ్ స్ట్రీమ్‌ను ఆసక్తిగా వీక్షించారు. కొందరు అతను అంతసేపు ఉంటాడో లేదో అని అనుకోగా.. అతను తన పట్టుదలతో చివరి వరకు నిలబడి ప్రపంచ రికార్డులో చోటు సంపాదించాడు. చరిత్ర సృష్టించిన వెంటనే ప్రపంచవ్యాప్తంగా అతనిపై ప్రశంసలు వెల్లువెత్తాయి. చివరికి, నార్మే నిరూపించింది ఏమిటంటే.. చాలాసార్లు ఏమీ చేయకుండా ఉండటమే అసలు పెద్ద ఛాలెంజ్ అని.

# మది దోచేలా.. రాజమహేంద్రి మురిసేలా

## బ్రిడ్జిలంకలో పర్యాటకాభివృద్ధికి మార్గం సుగమం - 116.97 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు



రాజమహేంద్రవరం, (విశాఖ సమాచారమ్):- పర్యాటకానికి ముఖద్వారమైన రాజమహేంద్రవరంలో సందర్శకులను మరింత ఆకట్టుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గత నెల 13న జరిగిన పర్యాటక సదస్సులో ఈ నగరాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. బ్రిడ్జిలంకలోని 116.97 ఎకరాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు ఆ భూమి పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్నప్పటికీ బదలాయింపు జరగక అభివృద్ధి పనులకు అడుగులు పడలేదు. ఇప్పుడు పనులు పట్టాలెక్కనున్నాయి.

**అఖండ గోదావరికి అనుసంధానంగా..**

అఖండ గోదావరి ప్రోజెక్టులో భాగంగా రాజమహేంద్రవరం వారసత్వ సంపద హేవలాక్ వంతెనతోపాటు పుష్కరాల రేవు, ఇతర ప్రాంతాల్లో అభివృద్ధికి కేంద్రం సుమారు రూ.94 కోట్లు కేటాయించింది. హేవలాక్ వంతెనకు అనుబంధంగా అదనంగా మరిన్ని ప్రాజెక్టులు బ్రిడ్జిలంకలో ఏర్పాటుకు ఇప్పటికే ఆ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. గుజరాత్‌లోని రాణా ఆఫ్ కచ్ తరహాలో ప్రత్యేక అలంకరణలతో రూపొందించిన గుడారాలు (టెంట్‌లు) నది మధ్యలో ఇసుక తిన్నెలపై ఏర్పాటుచేస్తారు. రాత్రి వేళ పర్యాటకులు బస చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఇక్కడ రాకపోకలకు పడవలతోపాటు, హేవలాక్ వెంతనపై నుంచి నడిచి వెళ్లేలా.. ఆసక్తి ఉన్నవారు రోప్ వేలో వెళ్లేలా తీర్చిదిద్దనున్నారు. బంగీ జంప్‌తోపాటు లంకలో సాహస, జల క్రీడలు, టెంట్ హౌస్‌లు, రెస్టారెంట్లు, రిసార్ట్స్ ఏర్పాటుకు ఇప్పటికే పలు కన్సల్టెన్సీల ప్రతినిధులు వచ్చి పరిశీలన చేశారు.

**మూడేళ్లలో సద్వినియోగం చేసుకోవాలి..**

పర్యాటక అభివృద్ధికి కేటాయించిన భూమిని నిబంధనలు అతిక్రమించకుండా మూడేళ్లలో సద్వినియోగం చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. పర్యాటకాభివృద్ధికి మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవ, ప్రభుత్వ ప్రోత్సాహం నేపథ్యంలో స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. హబ్ ఏర్పాటైతే పర్యాటకం, వినోదం, సాహసం, ఆతిథ్యం, సాహిత్యం తదితర అన్ని రంగాలకూ తగిన ప్రోత్సాహం లభిస్తుంది.

# విశ్వవ్యాప్త రంగుల పండుగ హోలీ

## నేడు మదన పూర్ణిమ - హోలీ




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ విశేష శక్తితో కూడినది. ఈ రోజున రాక్షస పీడ పోయేందుకు 'హోళికా' అనే ఒక విధమైన శక్తిని ఆరాధిస్తారు. ఆమె ప్రీతి కోసం అందరూ కలిసి గానాలు చేయడం , పరిహాసాలాడడం చేస్తారు. హెూలికాగ్నిని రగిల్చి ఆరాదించే సాంప్రదాయం ఇప్పుడు తగ్గిపోయి పరిహాసాది క్రియలే మిగిలాయి.

శ్రీమహాలక్ష్మి క్షీరసాగరం నుండి ఆవిర్భవించిందని పురాణ కథ. ఈ రోజున భక్తి శ్రద్ధలతో మహాలక్ష్మిని షోడశోపచారములతో చక్కగా ఆరాదించి లక్ష్మీ అష్టోత్తర శతనామాలు , కనకధారాస్తోత్రం , వంటివి పారాయణ చేయడం మంచిది. ఈరోజున లక్ష్మిని శ్రద్ధగా అర్చించే వారికి సమస్త ఐశ్వర్యాలు సిద్ధిస్తాయి.

ఈరోజుననే శ్రీకృష్ణుని ఉయ్యాలలో వేసి ఆరాదించాలి. దీని డోలోత్సవం అని అంటారు. ఒరిస్సావంటి ప్రాంతాలలో డోలా పూర్ణిమ పేరుతో ఇప్పటికీ దీనిని ఆచరిస్తారు.

**నరాడోలాగతం దృష్ట్వా గోవిందం పురుషోత్తమం !**
**ఫాల్గుణ్యం ప్రయతో భూత్వా గోవిందస్య పురంవ్రజేత్ !!**

ఉయ్యాలలో అచింపబడిన పురుషోత్తముడైన గోవిందుని ఈరోజున దర్శించిన వారికి వైకుంఠలోకం ప్రాప్తిస్తుందని ధర్మశాస్త్రాల వాక్యం.

హోలీ విశ్వ వ్యాప్తంగా ప్రకాశించే రంగుల పండుగ. ఈ పండుగ రోజున , తేజం యొక్క వివిధ తరంగాలు విశ్వవ్యాప్తంగా ప్రకాసిస్తాయి , అక్కడ వివిధ రకాల రంగులు ఉత్పత్తి అయ్యి వృద్ధి పొంది మరియు వాతావరణంలో ధాతువు పూర్తి సంపూర్ణ ధర్మాన్ని కలిగి ఉంటాయి. ఇదే ఈ పండుగ విశేషము.

హిరణ్యకశ్యపుడి పుత్రుడైన ప్రహ్లాదుడు , భగవంతుడైన విష్ణువుకు భక్తుడు. హిరణ్యకశ్యపుడు పలు మార్లు బెదిరించినప్పటికి , ప్రహ్లాదుడు భగవంతుడైన విష్ణువుని ప్రార్థించేవాడు. ఇతడి నోటిలో విషం పోస్తే , అది అమృతంగా మారింది. ఏనుగులచే తొక్కించమని ఆదేశించినా అతనికి ఎటువంటి హాని జరగలేదు. ఆకలితో ఉన్న విష సర్పాలున్న గదిలో ఉంచినప్పటికీ జీవించ గలిగాడు.

హిరణ్యకశ్యపుడు తన కొడుకును చంపాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చివరిగా , ప్రహ్లాదుడిని హిరణ్యకశ్యపుడి యొక్క సోదరి అయిన హెూలిక ఒడిలో చితిలో కూర్చోవాలని ఆజ్ఞాపించాడు , ఎందుకంటే మంటల నుండి రక్షించే శాలువాను ఆమె ధరించడం వలన ఆమెకి ఎలాంటి హాని జరగదు. ప్రహ్లాదుడు తన తండ్రి ఆదేశాలను వెంటనే అంగీకరించి , తనను రక్షించమని విష్ణువును వేడుకుంటాడు. మంటలు మొదలైనప్పుడు అందరూ చూస్తుండగానే హెూలిక శాలువా ఎగిరి పోవడం వలన ఆమె దహనం అవుతుంది ఆ శాలువా ప్రహ్లాదుడిని కప్పడం వలన అతడికి ఎటువంటి హాని జరగదు. హెూలిక మంటల్లో కాలిపోవటం వల్ల మనం హెూలీను జరుపుకుంటున్నాము.

ప్రాథమిక పరిశోధనల ప్రకారం 7వ శతాబ్దంలో రత్నావళి అనే సంస్కృత నాటకం వలన హెూలీ పండుగ ఉత్సవాలు జరుపుకొన్నారని తెలిసింది. వాస్తవంగా హెూలీ పండుగకు సంవత్సరం పొడవునా ఆచారాలు ఉంటాయి , మొదటగా రంగు పొడిని ఒకరికొకరు పూసుకుంటారు మరియు పొడవైన చిమ్మే గొట్టాలు లేదా చిమ్మే తుపాకుల నుండి రంగు నీటిని జల్లుకుంటారు. సంగీత కచేరీల ద్వారా అనగా పండుగకు సంబంధించిన పాటలను మరియు రాధా మరియు కృష్ణ పురాణ ప్రేమ కథ గురించి పాటలు పాడేవారు బీ ముఖ్యంగా జానపద పాటలు అనగా లి"హెూరి"లి పాటలను పాడేవారు. కొన్ని సంప్రదాయక జానపద పాటలు ఆజ్ బిరాజ్ మే హెూలీ రే రాసియా కొన్ని తరాల నుండి ఇప్పటి వరకు కూడా ఉన్నాయి.

సంవత్సరాలు గడుస్తున్నకొద్ది , ప్రవాసభారతీయులు ఉంటున్న చాలా ప్రాంతాలలో అనగా ఆఫ్రికా , ఉత్తర అమెరికాలో , యూరప్ మరియు దక్షిణ ఆసియాకు దగ్గర ఉన్న ప్రాంతాలలో హెూలీ పండుగను ఘనంగా జరపుకుంటారు.

వసంత కాలంలో వాతవరణములో మార్పులు జరగటం వల్ల వైరల్ జ్వరం మరియు జలుబు వస్తాయని ప్రజలు విశ్వసిస్తారు. అందుకని , సహజమైన రంగు పొడులను చల్లుకోవడం వల్ల ఔషధముగా పనిచేస్తుందని అర్థం.

సంప్రదాయముగా రంగులను నిమ్మ , కుంకుమ , పసుపు , బిల్వలను ఉపయోగించి ఆయుర్వేద వైద్యులు ఔషధ వనమూలికలను తయారు చేస్తారు.

తడి రంగుల కొరకు , మోదుగ పుష్పములు రాత్రంతా మరిగించి అవి పసుపు రంగులోకి మారేంత వరకు ఉంచుతారు , అది ఔషధ లక్షణాలు కలగి ఉంటుంది. రసాయన రంగుల ఉపయోగం హానికరంగా తయారయ్యింది. వీటి వల్ల అంతుచిక్కని వ్యాధులు వస్తున్నాయి. అలాంటి వ్యాధులు రాకుండా వుండాలి అంటే రసాయన రంగులను ఉపయోగించకుండా వుంటే మంచిది.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Office (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.